ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5
పార్వతీపురం మన్యం
జిల్లా వార్తలు
ఆదివారం 30 నవంబరు 2025



3న పార్వతీపురంలో మెగా జాబ్‌మేళా

బెలగాం, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): జిల్లాకేంద్రం పార్వతీపురంలో వచ్చేనెల 3న మెగా జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి కెసాయి కృష్ణ చైతన్య శనివారం ఒక ప్రటనలో తెలిపారు. టెన్త్, ఇంటర్, ఐటీఐ, డిప్లమో, ఏదైనా డిగ్రీ పాసైన వారు అర్హులని పేర్కొన్నారు. 18-30 సంవత్సరాల లోపు వారు.. గాయత్రి డిగ్రీ కళాశాలలో జరిగే జాబ్‌మేళాలో పాల్గొనొచ్చని వెల్లడించారు. మొత్తంగా 23 కంపెనీల ప్రతినిధులు ఇంటర్వ్యూలు నిర్వహించి అభ్యర్థులను ఎంపిక చేస్తారన్నారు. ఇతర వివరాల కోసం 91772 97528, 89788 78557 నెంబర్లను సంప్రదించాలని కోరారు.



గంటల్లోనే నగదు జమ

● ఇప్పటివరకు 12,973 టన్నుల ధాన్యం విక్రయం
● బ్యాంకు ఖాతాల్లోకి రూ.17.22 కోట్లు ● రైతుల్లో ఆనందం



పార్వతీపురం, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ధాన్యం కొనుగోలు ప్రక్రియ నత్తనడకన సాగుతున్నా రైతులకు గంటల వ్యవధిలోనే నగదు అందుతోంది. విక్రయించిన 24 నుంచి 48 గంటల్లోపే వారి బ్యాంకు ఖాతాల్లో జమ అవుతోంది. దీంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. జిల్లాలో 180 కేంద్రాల ద్వారా ధాన్యం కొనుగోలు చేపట్టారు. ఇప్పటివరకు 1177 మంది రైతులు 12,973 టన్నుల ధాన్యాన్ని విక్రయించారు. ఈ మేరకు వారి బ్యాంకు ఖాతాల్లో రూ. 17.22 కోట్లు జమైంది. ఇదిలా ఉండగా గత వైసీపీ ప్రభుత్వ హయాంలో ధాన్యం విక్రయించిన రైతులు నానా అవస్థలు పడేవారు. నగదు ఎప్పుడు జమవుతుందా? అని ఎదురుచూసేవారు. కొంతమంది రైతులు అప్పులు చేసుకుని మరీ సంక్రాంతి పండగ జరుపుకునేవారు. అయితే కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత సీన్ మారింది. ధాన్యం విక్రయించిన గంటల వ్యవధిలోనే రైతుల ఖాతాల్లో నగదు జమ చేస్తోంది. గత ఖరీఫ్ కాలంలోనూ ఇలానే చెల్లింపులు చేసింది. మొత్తంగా సర్కారు చర్యలతో మన్యం రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.



గరుగుబిల్లిలో ధాన్యం కొనుగోలు కేంద్రం పరిశీలిస్తున్న జేసీ



వేగవంతం చేస్తే మరింత మేలు..

జిల్లాలో లక్ష్యాలకు అనుగుణంగా ప్రస్తుతం ధాన్యం కొనుగోళ్లు జరగడం లేదు. దీనిపై సంబంధిత అధికారులు కూడా దృష్టిసారించడం లేదు. మరోవైపు తుఫాన్ హెచ్చరికలతో కొంతమంది రైతులు తమ ధాన్యాన్ని వ్యాపారులు, దళారులకు విక్రయించి నష్టపోతున్నారు. మొత్తంగా మన్యం నుంచి ఇతర జిల్లాలకు ధాన్యం తరలిపోతుంది. ఈ నేపథ్యంలో జిల్లాలో ధాన్యం కొనుగోలు ప్రక్రియను మరింత వేగవంతం చేయాల్సి ఉంది.

ఎంతో ఆనందంగా ఉంది

నేను 160 బస్తాల ధాన్యాన్ని కొనుగోలు కేంద్రంలో విక్రయించా. 24 గంటల్లోనే నా బ్యాంకు ఖాతాలో నగదు జమైంది. ఎంతో ఆనందంగా ఉంది.

- ఆర్.సింహాచలం, బాగువలస, సాలూరు మండలం

24 గంటల్లోనే..

నేను 141 ధాన్యం బస్తాలను కొనుగోలు కేంద్రంలో విక్రయించా. దీనికి సంబంధించి 24 గంటల్లో నా బ్యాంకు ఖాతాలో నగదు జమైంది.

- చింతల సత్యనారాయణ, అప్పయ్యపేట, సీతానగరం మండలం

12 గంటల్లోపే జమ

నేను 69 క్వింటాళ్ల ధాన్యాన్ని కొనుగోలు కేంద్రంలో విక్రయించా. దీనికి సంబంధించి రూ. 1,91,197 నా బ్యాంకు ఖాతాలోకి 12 గంటల్లోపే జమైంది. ఎంతో ఆనందంగా ఉంది.

- బి.రాంబాబు, చిలకపల్లి, బలిజిపేట మండలం

ప్రక్రియ వేగవంతం

ధాన్యం విక్రయించిన 48 గంటల్లోపే రైతుల ఖాతాల్లోకి నగదు జమవుతుంది. కొంతమంది రైతులకు 12 గంటల్లోపే నగదు అందుతుంది. ఇప్పటివరకు రూ.17.22 కోట్లు రైతుల ఖాతాల్లోకి జమైంది. జిల్లాలో ధాన్యం కొనుగోలు ప్రక్రియను వేగవంతం చేస్తున్నాం.

- యశ్వంత్‌కుమార్‌రెడ్డి, జాయింట్ కలెక్టర్, పార్వతీపురం మన్యం

గురజాడ బోధనలు సమాజానికి మార్గదర్శకం 6లో
● రచయిత, విశ్లేషకుడు తెలకపల్లి రవి

ఆధ్యాత్మిక బాటలో..
● ఏడేళ్లుగా భక్తి కార్యక్రమాలు
● 40 రోజుల పాటు నిత్యాన్నదానం
● ఇదీ శివభక్తుల విశిష్టత

పదమూడేళ్ల కాలనీ.. పట్టించుకునేదెవరని? 6లో
● గిరిజనులపై ప్రభుత్వాల చిన్నచూపు

150 ప్రాంతాలు.. వెయ్యి మంది పోలీసులు
● విజయనగరంలో విస్తృతంగా వాహన తనిఖీలు

పార్వతీపురాన్ని కార్పొరేషన్ స్థాయికి తీసుకెళ్లండి 8లో
● ఎమ్మెల్యే విజయచంద్ర

దళారుల ప్రమేయం లేకుండా ధాన్యం సేకరణ 6లో
● మంత్రి కొండపల్లి శ్రీనివాస్

ప్లాస్టిక్ రహితంగా మన్యాన్ని తీర్చిదిద్దాలి

● కాలుష్య నియంత్రణ మండలి చైర్మన్ కృష్ణయ్య

పార్వతీపురం, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): పార్వతీపురం మన్యం జిల్లాను ప్లాస్టిక్ రహితంగా తీర్చిదిద్దాలని రాష్ట్ర కాలుష్య నియంత్రణ మండలి చైర్మన్ పి.కృష్ణయ్య సూచించారు. సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌ను పూర్తిగా నిషేధించాలన్నారు. శనివారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో కాలుష్య నియంత్రణపై అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పర్యావరణ పరిరక్షణే లక్ష్యంగా పనిచేయాలన్నారు. మొక్కల పెంపకంపై దృష్టిసారించాలన్నారు. స్వచ్ఛ పార్వతీపురం దిశగా అడుగులు వేస్తున్నామని కలెక్టర్ ప్రభాకర్‌రెడ్డి తెలిపారు. ప్రతి గ్రామంలో పారిశుధ్య నిర్వహణ బాధ్యతలను సర్పంచ్‌లకు అప్పగించామని వెల్లడించారు. కార్యదర్శులు, ఎంపీడీవోలు సైతం ఆ పని మీదే ఉన్నారన్నారు. పరిసరాల పరిశుభ్రతకు పెద్దపీట వేస్తున్నామని, ప్లాస్టిక్, పాలిథిన్ వస్తువులను జిల్లాలో పూర్తిగా నిషేధించామని ఆయన తెలిపారు.

అన్నా క్యాంటీన్లకు కమిటీలు

● నిర్వహణపై పర్యవేక్షణ ● ఆహారం నాణ్యత, పరిశుభ్రతకు పెద్దపీట
● ఉత్తర్వులు జారీ చేసిన ప్రభుత్వం

పాలకొండ, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): పేదల ఆకలి తీరుస్తున్న అన్నా క్యాంటీన్ల నిర్వహణలో ఎలాంటి లోపాలు తలెత్తకుండా కూటమి ప్రభుత్వం కట్టుదిట్టమైన చర్యలు చేపట్టింది. దీనిలో భాగంగానే ప్రతి అన్నా క్యాంటీన్ పరిధిలో అడ్వైజరీ కమిటీ ఏర్పాటు చేయాలని ఉత్తర్వులు జారీ చేసింది. ఈ కమిటీలో చైర్మన్‌గా మున్సిపల్ చైర్‌పర్సన్ లేదా కౌన్సిలర్ ఉంటారు. ఇక సభ్యులుగా శానిటేషన్, ఎన్విరాన్‌మెంట్, వార్డు ఉమెన్ వీకర్స్ సెక్షన్ సెక్రటరీలు, ఎన్‌జీవో, ఎస్‌హెచ్‌జీ ప్రతినిధులు ఉంటారు. సంబంధిత అన్నా క్యాంటీన్ నోడల్ ఆఫీసర్ కన్వీనర్‌గా ఉంటారు. జిల్లాలో పాలకొండ, పార్వతీపురం అన్నాక్యాంటీన్లు ఉన్నాయి. వాటి ద్వారా రోజూ వేలాది మంది నిరుపేదలకు రుచికరమైన భోజనం అందిస్తున్నారు. సాలూరు, కురుపాం, సీతంపేటకు అన్నా క్యాంటీన్లు మంజూరు చేశారు. వాటి భవనాల నిర్మాణం జరుగుతుంది. ఇవి కూడా మరికొద్ది నెలల్లో ప్రజలకు అందుబాటులోకి రానున్నాయి.

కమిటీల బాధ్యత...

అన్నా క్యాంటీన్లలో ఆహార నాణ్యత, పరిశుభ్రతను కమిటీలు పర్యవేక్షించాల్సి ఉంది. డైలీ ఫుడ్ టేస్ట్ నమోదు, సరుకుల నాణ్యత చూడాలి. క్యాంటీన్ నిర్వహణపై రోజువారీ, వారాంతపు రికార్డులు సిద్ధం చేయాలి. సీసీటీవీ, ఎఫ్ఆర్ఎస్, వంటి వాటిని పరిశీలిస్తారు. లబ్ధిదారులు నుంచి ఫీడ్‌బ్యాక్ సేకరిస్తారు. సేవల్లో లోపాలు ఉంటే వెంటనే పరిష్కారిస్తారు. కమ్యూనిటీ భాగస్వామ్యం, వలంటీర్లు సమన్వయం ప్రభుత్వ ఆమోదిత వారపు మెనూ అమలును సైతం పరిశీలి స్తారు. అన్నా క్యాంటీన్లు మరింత పారదర్శకంగా పనిచేయాలనే లక్ష్యంతో ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంది.



పాలకొండలో అన్నా క్యాంటీన్

పాలకొండ అభివృద్ధికి సబ్‌ప్లాన్ నిధులు 8లో

పదో తరగతి పరీక్ష ఫీజు గడువు పెంపు 7లో

కోరుకొండ సైనిక స్కూల్ వార్షికోత్సవం
● ప్రత్యేక ఆకర్షణగా సాంస్కృతిక ప్రదర్శనలు, సాహస విన్యాసాలు

స్వచ్ఛతాహి సేవలో భాగస్వాములు కండి 8లో
● కలెక్టర్ ప్రభాకర్ రెడ్డి

మాదకద్రవ్యాల రవాణాను పూర్తిగా అరికట్టాలి

● కలెక్టర్ ప్రభాకర్‌రెడ్డి ఆదేశం

పార్వతీపురం, నవంబరు29(ఆంధ్రజ్యోతి): జిల్లాలో మాదకద్రవ్యాలు, మత్తు పదార్థాల రవాణా, వినియోగాన్ని పూర్తిగా అరికట్టాలని కలెక్టర్ ప్రభాకర్ రెడ్డి ఆదేశించారు. డ్రగ్స్, గంజాయి నివారణపై గ్రామస్థాయిలో ప్రజలకు అవ గాహన కల్పించాలన్నారు. శనివారం కలెక్టరేట్‌లో మాదక ద్రవ్యాల నియంత్రణ, జిల్లా స్థాయి రహదారి భద్రత కమిటీల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 'ప్రతి పది ఇళ్లకు ఒక వలంటీర్‌ను ఏర్పాటు చేసుకుని విస్తృతం ప్రచారం నిర్వహించాలి. కళాశాల, పాఠశాలల్లోని విద్యార్థులనూ చైతన్యపర్చాలి. స్వయం సహాయ సంఘాల్లోని సభ్యులను ఇందులో భాగస్వాములను చేయాలి. ప్రజల్లో అవగాహన ద్వారానే డ్రగ్స్ నివారణ సాధ్యమవుతుంది. సమ స్యలు ఉన్న చోట ప్రణాళికలు వేసుకుని కార్యక్రమాలు నిర్వహించాలి.' అని తెలిపారు. గ్రామస్థాయిలో పక్కాగా పౌర హక్కుల దినోత్స వాలను చేపట్టాలన్నారు. ఇందులో అట్రాసిటీ కేసులు, సారా, బాల్య వివాహాలతో కలిగే అనర్థాలను గ్రామస్థులకు తెలియజేయాలని సూచించారు. సంతలు జరిగే ప్రదేశాలు, షాపుల వద్ద నిఘా వ్యవస్థను ఏర్పాటు చేయాలని, మత్తు పదార్థాలు విక్రయించే వారి వివరాలు సేకరించాలని ఆదేశించారు. అవగాహన, చైతన్య కార్యక్రమాల ఫొటోలు, వీడియోలను తమకు అందించాలన్నారు. జిల్లాలో రహదారి ప్రమాదాలను పూర్తిగా నివారించాలని తెలిపారు. రద్దీ ప్రదేశాల్లో విద్యుత్ దీపాలను ఏర్పాటు చేయాలన్నారు. ద్విచక్ర వాహనదారులు హెల్మెట్, మిగతా వాహనదారులు సీట్ బెల్ట్ పెట్టుకునే విధంగా చర్యలు తీసుకోవాలని సూచించారు. లైసెన్స్ లేకుండా వాహనాలు నడిపేవారికి జరిమానా విధించాలన్నారు.

● కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సంక్షేమ పథకాల అమలులో ప్రగతి కనిపించాలని కలెక్టర్ సంబంధిత అధికారులను ఆదేశించారు. పథకాల పూర్తి సమాచారం ఆయా శాఖల అధికారుల వద్ద ఉండాలన్నారు. పెండింగ్ పనుల వివరాలను ఎంపీ దృష్టికి తీసుకెళ్లి నిధులు విడుదలయ్యేలా చూసుకోవాలని కలెక్టర్ సూచించారు. ఈ సమావేశంలో జేసీ యశ్వంత్‌కుమార్ రెడ్డి, ఎస్పీ మాధవరెడ్డి, సబ్ కలెక్టర్ వైశాలి, డీఎస్పీ ఎం.రాంబాబు, ప్రత్యేక ఉప కలెక్టర్ ధర్మచంద్రారెడ్డి, డీఆర్‌డీఏ పీడీ సుధారాణి, డీఈవో రాజ్‌కుమార్ పాల్గొన్నారు.

టెన్త్‌లో శతశాతం ఉత్తీర్ణత సాధించాలి

జిల్లాలో టెన్త్ విద్యార్థులందరూ శతశాతం ఉత్తీర్ణత సాధించాలని కలెక్టర్ ఆదేశించారు. మైస్కూల్, మై ప్రైడ్ కార్యక్రమంపై కలెక్టరేట్‌లో సంబంధిత అధికారులతో సమీక్షించారు. ' టెన్త్ ఫలితాల్లో గత మూడేళ్లుగా రాష్ట్రస్థాయిలో మొదటి స్థానంలో నిలిచాం. ఈ ఏడాది కూడా జిల్లాను ప్రథమస్థానంలో నిలపాలి. వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలి. పాఠశాలల్లో విద్యాప్రమా ణాల మెరుగు, విద్యార్థుల ఆరోగ్యం కోసం నూతన కార్యాచరణ ప్రణాళికను సిద్ధం చేశాం. 'ముస్తాబు'తో విద్యార్థుల ఆరోగ్యంలో గణ నీయమైన మార్పు వచ్చింది. ఒక్క కేసు కూడా నమోదు కాలేదు. పిల్లల మానసిక ఉల్లాసం కోసం పాఠశాలల్లో 'ఆనంద లహరి' అమలు చేస్తున్నాం. దీనిలో భాగంగా విద్యార్థులతో నృత్యాలు, యోగా, ఏరోబిక్స్ చేయిస్తున్నాం. సామాజిక మాధ్యమాల ద్వారా ఈ కార్యక్ర మాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి.'అని తెలిపారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ ప్రభాకర్‌రెడ్డి

జాతీయస్థాయిలో జిల్లాకు ఐదో ర్యాంకు

పార్వతీపురం, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): ఆకాంక్షిత జిల్లాల కార్యక్రమంలో పార్వతీపురం మన్యం జాతీయ స్థాయిలో ఐదో ర్యాంకు సాధించిందని కలెక్టర్ ప్రభాకర్‌రెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. సమగ్ర అభివృద్ధి, పనితీరు తదితర అంశాల్లో జిల్లా మెరుగైందని పేర్కొన్నారు. ముఖ్యంగా పాథమిక మౌలిక సదుపాయాల కల్పనలో జాతీయంగా ప్రథమ స్థానంలో నిలిచినట్లు తెలిపారు. విద్యా రంగంలో 11 స్థానానికి చేరిందన్నారు. ఆరోగ్యం, పౌష్టికాహారం, వ్యవసాయం, సాగునీటి వనరుల్లో కూడా పురోగతి సాధించినట్లు వెల్లడించారు. డేటా ఆధారిత పాలనపై నిరంతరం దృష్టిసారించడంతో మన్యం జిల్లా దేశంలోని అత్యుత్తమ ఆకాంక్షిత జిల్లాల జాబితాలోకి చేరిందని స్పష్టం చేశారు.

సమాజాన్ని మేల్కొలిపిన కన్యాశుల్కం

● హైకోర్టు సీనియర్ జడ్జి జస్టిస్ మానవేంద్రనాథ్ రాయ్

విజయనగరం కల్చరల్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): గురజాడ అప్పారావు రచించిన కన్యాశుల్కం నాటకం సమాజాన్ని మేల్కొలిపిందని హైకోర్టు సీనియర్ జడ్జి జస్టిస్ మానవేంద్రనాథ్‌రాయ్ అన్నారు. శనివారం రాత్రి ఆయన గురజాడ గృహానికి వచ్చారు. ప్రతి గదిలోకి వెళ్లి గురజాడ రాసిన పుస్తకాలను పరిశీ లించారు. అనంతరం గురజాడ అప్పారావు వారసులు వెంకటేశ్వరప్రసాద్, ఇందిరలు జస్టిస్ చీకటి మానవేంద్రనాథ్ రాయ్‌కు కన్యాశుల్కం పుస్తకాన్ని బహూకరించారు.



గురజాడ విగ్రహానికి పూలమాల వేస్తున్న జస్టిస్ మానవేంద్రనాథ్‌రాయ్

సాఫీగా రాకపోకలు సాగేనా?

● రోడ్ల మరమ్మతులకు ప్రభుత్వం గ్రీన్‌సిగ్నల్ ● పర్యవేక్షించాలని సీఎం ఆదేశాలు
● ఇప్పటికైనా అధికారుల తీరు మారేనా?



వీరఘట్టం మండలం పీవీఆర్‌పురం రోడ్డు ఇలా..



గరుగుబిల్లి మండలం కుంకిడివరం రోడ్డు పరిస్థితి ఇదీ..

పార్వతీపురం, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): జిల్లాలో పలు ప్రధాన రహదారుల మరమ్మతులకు ప్రభుత్వం గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. తక్షణమే పనులు చేపట్టాలని ఆదేశాలు జారీ చేసింది. వాటిని పర్యవేక్షించాలని సంబంధిత అధికారులను ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఆదేశించారు. కాగా ఈ పనులు పూర్తయితే జిల్లావాసులకు రహదారి కష్టాలు తప్పనున్నాయి. వాస్తవంగా గత వైసీపీ ప్రభుత్వం రహదారులపై నిర్లక్ష్యంగా వ్యవహరించింది. నిర్మాణం మాటెలా ఉన్నా.. కనీసం మరమ్మతులు కూడా చేయించలేకపోయింది. దీంతో అడుగుకో గుంతతో రోడ్లు అధ్వానంగా మారాయి. ప్రజలు అనేక ఇబ్బందులు పడ్డారు. అయితే ఈ సమస్యను పరిగణనలోకి తీసుకున్న కూటమి ప్రభుత్వం జిల్లాలో కొన్ని రహదారులకు మరమ్మతులు చేపట్టింది. మరికొన్ని చోట్ల రోడ్ల నిర్మాణాలకు నిధులు మంజూరు చేసింది. అయితే టెండర్లు ఖరారు కాకపోవడంతో కొన్ని రహదారుల పనులు నేటికీ ప్రారంభం కాలేదు. రాయగడ రోడ్డు నుంచి కూనేరు పనులే ఇందుకు ఉదాహరణగా చెప్పొచ్చు. ఈ రోడ్డు నిర్మాణానికి నిధులు మంజూరైనా పనులు మాత్రం ప్రారంభం కాలేదు. మరమ్మతులు చేపడుతూ కాలం వెల్లదీస్తున్నారు. దీనివల్ల వాహనదారులు, ప్రజలకు దారి కష్టాలు తప్పడం లేదు. అయితే ఇటువంటి రహదారులపై దృష్టి సారించిన కూటమి ప్రభు త్వం డిసెంబరు లోపు మరమ్మతు పనులు పూర్తిచేయాలని

(మిగతా 8వ పేజీలో...)



పార్వతీపురం మండలం ఎంఆర్ నగరం రహదారి ఇలా..

పదమూడేళ్ల కాలనీ.. పట్టించుకునేదెవరని?

- గిరిజనులకు ఏళ్ల తరబడి కష్టాలు
- కానరాని మౌలిక వసతులు
- పరిష్కారానికి నోచని వైనం



గిరిజన కాలనీకి వెళ్లే రహదారి

విజయనగరం టౌన్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి)

ఎన్నో ఏళ్లుగా రైలు పట్టాలను ఆనుకొని ఉన్న ఖాళీ స్థలంలో మగ్గుతున్న గిరిజనానికి సొంత స్థలాలు ఇచ్చారని సంబర పడిపోయారు. కానీ ఆ తరువాత మౌలిక వసతుల విషయమై ఎవరూ పట్టించుకోక పోవడంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. తాగునీరు, రహదారులు, విద్యుత్ సదుపాయాలు లేక అవస్థలు పడుతున్నారు. తమ సమస్యలు పరిష్కరించాలని అధికారులు, ప్రజా ప్రతినిధుల చుట్టూ ఎన్నిసార్లు తిరిగినా స్పందన కనిపించలేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

సమస్యల వలయంలో..

కార్పొరేషన్ పరిధిలోని 45వ డివిజన్‌లో కలెక్టరేట్‌కు కూతవేటు దూరంలోని కేఎల్‌పురం సమీప గిరిజన కాలనీలో కనీస వసతులు లేక స్థానికులు అవస్థలకు గురవుతున్నారు. 13 సంవత్సరాల క్రితం అప్పటి కలెక్టర్ ఎంఎం నాయక్ చొరవతో రైల్వేట్రాక్ ను ఆనుకొని నివాసం ఉంటున్న 35 గిరిజన కుటుంబాలకు కేఎల్ పురం సర్వేనెంబర్ 137లో ఇంటి పట్టాలను మంజూరు చేశారు. ఆ కాలనీలో తాగునీరు, విద్యుత్, రహదారి సౌకర్యం కల్పించాలని సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. అనంతరం ఆయన బదిలీపై వేరే ప్రాంతానికి వెళ్లిపోయారు. అధికారులు ఆ గిరిజనుల విషయం మరచిపోయారు. కేవలం మూ డు విద్యుత్ స్తంభాలు, వారా నికి ఒక వాటర్ ట్యాంకుతో నీటి సరఫరా తప్ప ఇతర సౌకర్యాలు కల్పించలేదు. ఈ 13 ఏళ్లలో మూడు ప్రభుత్వా లు మారినా వారి జీవితాలు మారలేదు.

అందని ద్రాక్షగా..

ఈ కాలనీకి వెళ్లే ఇరు మా ర్గాల్లో ప్రైవేటు లేఅవుట్లు ఉండటంతో కొంతమంది ఉద్యో గులు స్థలాలను కొనుగోలు చేసుకొని.. ఇళ్లు నిర్మించుకున్నారు. అక్కడ విద్యుత్ దీపాలు, తాగునీరు, రహదారి సౌకర్యాలను అధికారులు కల్పించారు. కానీ గిరిజనుల కాలనీ వైపు కన్నెత్తి చూడక పోవడం గమనార్హం. కేవలం మూడు విద్యుత్ స్తంభాలను ఏర్పాటు చేసి వదిలేశారు. కాలనీ మొత్తం మీద ఒకే ఒక విద్యుత్ దీపం వెలుగుతోంది. కాలనీ చుట్టూ పిచ్చిమొక్కలు, పక్కనే పెద్ద కొండ ఉన్నాయి. దీంతో నిత్యం పాములు, విష పూరితమైన పురుగులు తిరుగాడుతుంటాయని.. చీకటిపడితే బయటకు రావాలంటే భయమేస్తోందని వారు వాపోతున్నారు. తాగునీటి కోసం కిలోమీటరు దూరంలో ఉన్న ద్వారపూడి కూడలి వద్ద ఉన్న చేతి పంపుపై ఆధారపడాల్సి వస్తోంద ని వాపోతున్నారు. ప్రధానంగా రహదారులు లేకపోవడంతో వర్షాకాలంలో తమ బాధలు వర్ణనాతీతమని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తమ కాలనీలో 35 కుటుంబాలకు పట్టాలు ఇచ్చినా పూర్తి స్థాయిలో సదుపాయాలు లేక కొంతమంది రావడం లేదని ఉన్నవారు సమస్యలతో సహవాసం చేస్తున్నారని అక్క డి వారు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు, ప్రజా ప్రతినిధులు స్పందించి కాలనీలో మౌలిక వసతులు కల్పించాలని కోరుతున్నారు.

పట్టించుకోవడం లేదు..



కాలనీలో కనీస వసతులు ఏర్పాటు చేయాలని కోరుతూ కలెక్టర్‌తో పాటు ఎందరో అధికారులను కోరాం. ఎవరూ పట్టించుకోలేదు. రోడ్డు లేక తుప్పల మధ్య నుంచి రాకపోకలు సాగిస్తున్నాం. గిరిజనుల కోసం ప్రభుత్వాలు ప్రత్యేక శ్రద్ధ కనబరుస్తాయని విన్నాం. కానీ మా వరకు వచ్చేసరికి పట్టించుకునే నాథుడే లేరు.

-రావి రత్నం

ఇబ్బందులు తప్పడం లేదు..



ఇళ్ల స్థలాలు ఇచ్చారు. వసతులను మరిచారు. కొన్నేళ్లుగా రేషన్ కావాలన్నా.. తాగునీరు కావాలన్నా కిలోమీటరు దూరం వెళుతున్నాం. కాలనీ ప్రారంభించినప్పటి నుంచి ఇబ్బందులు పడుతున్నాం.

-మంచాల పోలమ్మ

విష జంతువులతో భయం



మా కాలనీలో మనుషుల కంటే విషజంతువులే అధికంగా ఉన్నాయి. రాత్రి, పగలు తేడా లేకుండా తిరుగుతున్నాయి. విద్యుత్ స్తంభాలు ఉన్నా దీపాలు లేక.. ఉన్నా.. అవి వెలగక చీకట్లో ఇబ్బందులు పడుతున్నాం

-ఎం.శంకరరావు

ఆధ్యాత్మిక బాటలో..

- ఏడేళ్లుగా భక్తి కార్యక్రమాలు
- 40 రోజుల పాటు నిత్యాన్నదానం
- ఇదీ శివభక్తుల విశిష్టత



శివస్వాముల ఊరేగింపు

బొబ్బిలి, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): బొబ్బిలి పట్టణంలోని జంగాల వీధిలో ఓ పురాతన శివాలయం ఉంది. జంగాల శివాలయంగా పేరొందింది. ఆ ఆలయ పరిసరాలలో గల రావువారి వీధి, పూల్‌బాగ్ తదితర ప్రాంతాలతో పాటు పట్టణంలోని వివిధ వార్డులకు చెందిన భక్తులు ఏటా కార్తీక మాసంలో శివమాలను ధరించి భక్తిని చాటుకుంటున్నారు. రావువారి వీధికి చెందిన కర్రోతు రాములప్పన్న అనే యువకుడు గురుస్వామిగా వ్యవహరిస్తున్నారు. బొత్స అప్పారావు (అప్పు) అధ్యక్షునిగా, ఊళ్ల మహేశ్ కార్యదర్శిగా శివదీక్షా సేవా సమితిని ఏర్పాటు చేసి.. ఏడేళ్లుగా ప్రజల్లో భక్తి భావాన్ని పెంపొందించేందుకు కృషి చేస్తున్నారు.

అన్నదానం..

220 మంది యువకులు 41 రోజుల పాటు దీక్షాధారులై.. అభిషేకాలు... ఇతర పూజలు చేస్తున్నారు. వీరితో పాటు రోజూ మరో 200 మందికి నిత్యాన్నదానం చేస్తున్నారు. అంతేకాదు.. శివ తత్వాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు తమవంతు ప్రయత్నం చేస్తున్నారు. ఇందులో భాగంగా అఘోరాల వేషంలో గతంలో పట్టణంలో ప్రచారం చేశారు. ఈ ఏడాది మొత్తం 220 మంది భక్తులు త్రిశూలాలను ధరించి... ఒంటి నిండా విభూతిని పూసుకొని శివనామ స్మరణలతో పట్టణంలో భారీగా తిరువీధులు నిర్వహిస్తున్నారు.



అన్నదానం చేస్తున్న దృశ్యం



శివ పూజల్లో పాల్గొన్న భక్తులు

సమాజానికి మేలు కలగాలని..

సమాజానికి మేలు కలగాలని... పరమశివుని దివ్య ఆశీస్సులు అందరిపై ఉండాలన్న సత్సంకల్పంతో ఈ తరహా భక్తి కార్యక్రమాలను నిర్వహిస్తున్నాం. సాలూరులో జరుగుతున్న ఆధ్యాత్మిక కార్యక్రమాలతో ప్రేరణ పొంది ఏడేళ్ల నుంచి బొబ్బిలిలో నిర్వహిస్తున్నాం. శివదీక్షా సేవా సమితి ద్వారా సామాజిక సేవా కార్యక్రమాలు కూడా చేపడుతున్నాం. శివమాల ధారణ కాలంలో జ్యోతిర్లింగాల దర్శనానికి వెళుతున్నాం. పేదవారిని మాతో పాటు శివదర్శనానికి తీసుకెళుతున్నాం. నిత్యాన్నదానం చేస్తున్నాం.

-రాములప్పన్న, బొత్స అప్పారావు

గురజాడ రచనలు సమాజానికి మార్గదర్శకం

- రచయిత, విశ్లేషకుడు తెలకపల్లి రవి



సమావేశంలో మాట్లాడుతున్న తెలకపల్లి రవి తదితరులు

విజయనగరం రూరల్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): మహాకవి గురజాడ వెంకట అప్పారావు రచనలు నేటి సమాజానికి మార్గ దర్శకమని రచయిత, విశ్లేషకుడు తెలకపల్లి రవి అన్నారు. గురజాడ అప్పారావు వర్ధంతి సందర్భంగా శనివారం జేఎన్‌టీయూలో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గురజాడ సాహిత్యంలో మానవతా భావాలు, ప్రగతిశీల ఆలోచనల నేటి సమాజం స్ఫూర్తిగా తీసుకోవాలన్నారు. స్త్రీ విద్య ప్రాధాన్యం, సామాజిక బాధ్యత, మానవతా విలువలపై ఆయన బోధనలు ఆదర్శనీయమన్నారు. నేటి సమాజంలో కనిపిస్తున్న అనేక సానుకూల మార్పులు గురజాడ లాంటి సాహిత్యకారుల దూరదృష్టి ఫలితమేనని తెలిపారు.

జాతీయ స్మారక చిహ్నంగా చేయాలి..

గురజాడ అప్పారావు యావత్తు ప్రపంచానికి దేశభక్తి గేయాన్ని అందించారని... ఆయన స్వగృహాన్ని జాతీయ స్మారక చిహ్నంగా గుర్తించాలని తెలకలపల్లి రవి అన్నారు. శనివారం గురజాడ స్వగృహంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ గురజాడ రచనలు చిరస్థాయిగా నిలిచిపోయాయన్నారు. అమరావతి రాజధానికి శంకుస్థాపన కార్యక్రమంలో ప్రధాని నరేంద్రమోదీ గురజాడ మాటలు పలికారని గుర్తు చేశారు. ప్రజల భాషకు పట్టం కట్టిన గురజాడ పేరిట సాంస్కృతిక విద్యాలయం ఏర్పాటు చేయాలని కోరారు. ఈ సమావేశంలో సాహితీ సమాఖ్య ప్రతినిధులు చీకటి దివాకర్, రాజగోపాల్, వెంకటరావు, జక్కు రామకృష్ణ, గురజాడ వారసులు వెంకట ప్రసాద్, ఇందిర తదితరులు పాల్గొన్నారు.

నెల్లిమర్లలో...

నెల్లిమర్ల, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): మహాకవి గురజాడ అప్పారావు వర్ధంతిని స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శనివారం ఘనంగా నిర్వహించారు. తెలుగు విభాగం ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి ప్రిన్సిపాల్ డాక్టర్ కే.రేఖ అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన రాష్ట్ర సాహితీ స్రవంతి గౌరవ అధ్యక్షులు తెలకలపల్లి రవి గురజాడ విగ్రహానికి పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా రవి మాట్లాడుతూ భాషా ఉద్యమాలకు ఊపిరిపోసినది ఉత్తి ఆంధ్ర కాదు ఉత్తరాంధ్ర అని కీర్తించారు. ఈ కార్యక్రమంలో చీకటి దివాకర్ న్యాయవాది ఎస్ఎస్ఎస్‌వీ ఆర్.రాజు, తెలుగు అధ్యాపకురాలు ఎం.రమాగీతాదేవి, ఐక్యూఏసీ కోఆర్డినేటర్ జీవీఎస్ జయపాలరావు, వైస్ ప్రిన్సిపాల్ డి.అప్పారావు, ఎ.జయలక్ష్మి, బి.శుభ, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

దళారుల ప్రమేయం లేకుండా ధాన్యం సేకరణ

- అందరూ సమన్వయంతో పని చేయాలి
- 24 గంటల్లో రైతుల ఖాతాలకు నగదు జమ
- మంత్రి కొండపల్లి శ్రీనివాస్

విజయనగరం, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో దళారులు ప్రమేయం లేకుండా ధాన్యం సేకరణ జరగాలని రాష మంత్రి కొండపల్లి శ్రీనివాస్ అన్నారు. అప్పుడే రైతులకు గిట్టుబాటు ధర లభిస్తుందన్నారు. శనివారం మధ్యాహ్నం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ధాన్యం సేకరణపై సమీక్షా సమావేశం నిర్వహించారు. దీనికి ముందు జిల్లాలో ధాన్యం సేకరణపై పవర్‌పాయింట్ ప్రెజెంటేషన్ చేశారు. ఈ సందర్భంగా మంత్రి కొండపల్లి శ్రీనివాస్ మాట్లాడుతూ గతంలో డిసెంబరు నెలలో ధాన్యం కొనుగోలు ప్రారంభించేవారని, గత ఏడాది నుంచి నవంబరు నెలలో సేకరణ ప్రారంభిస్తున్నామని చెప్పారు. రైతులు ధాన్యం ఇచ్చిన వెంటనే 24 గంటల లోపల వారి ఖాతాలకు నగదు జమ అవుతున్నాయని తెలిపారు. జిల్లాలో ఇప్పటి వరకూ 35 వేల టన్నులు సేకరించినట్లు చెప్పారు. మిల్లర్లు ,ఎఫ్‌సీఐ, సివిల్ సప్లయిస్, రెవెన్యూ, వ్యవసాయ అధికారులు సమన్వయంతో పని చేస్తే రైతులకు ఎలాంటి ఇబ్బందులు ఉండవని చెప్పారు. లాభాలు తక్కువగా ఉన్నప్పటికీ రైతులు వరి సాగు కొనసాగిస్తున్నందున వారికి మరింత ప్రోత్సాహం కల్పించాలని మంత్రి సూచించారు.



మాట్లాడుతున్న మంత్రి కొండపల్లి శ్రీనివాస్

అదనంగా తీసుకుంటే చర్యలు..

మిల్లర్లు తేమ శాతం, వేస్టేజీ పేరుతో రైతుల నుంచి నాలుగు, ఐదు కిలోల ధాన్యం అదనంగా తీసుకుంటున్నట్లు ఫిర్యాదులు వస్తున్నాయని... ఇది సరైనది కాదని కలెక్టర్ రామసుందర్ రెడ్డి హెచ్చరించారు. ధాన్యం నాణ్యత చూసే బాధ్యత సేకరణ కేంద్రాల సిబ్బందిపై ఉందని చెప్పారు. కస్టోడియన్ అధికారులు అప్రమత్తంగా ఉండాలన్నారు. రైతులు మిల్లులకు వెళ్లకుండా... నేరుగా పీపీసీలకు మాత్రమే వెళ్లేలా చూడాలన్నారు. మధ్యవర్తుల ప్రమేయం లేకుండా సేకరణ జరిగేలా చూడాలని ఆదేశించారు. అవసరమైతే దళారులపై కఠిన చర్యలు తీసుకోవాలని తహసీల్దారులకు ఆదేశించారు. మిల్లర్లు రూ.141 కోట్ల మేర బ్యాంకు గ్యారెంటీలు ఇవ్వాల్సి ఉందని...వెంటనే ఆ ప్రక్రియ పూర్తి చేయాలన్నారు. వర్షాలు పడితే ధాన్యం పాడవకుండా 2000 టార్పాలిన్లు సిద్ధంగా ఉంచామని.. మరో 600 టార్పాలిన్లు రానున్నాయని కలెక్టర్ తెలిపారు. ఇదిలా ఉండగా.. క్వింటా ధాన్యానికి 67 కేజీల బియ్యం కూడా రావడం లేదని జిల్లా రైసు మిల్లర్ల సంఘ అధ్యక్షులు బలగ వెంకటరావు అన్నారు. ఈ సమావేశంలో సివిల్ సప్లయిస్ డీఎం శాంతి, ఎఫ్‌సీఐ డీఎం సునీల్ కుమార్, డీఎస్‌వో మురళీధర్, మార్కెటింగ్ ఏడీ రవీంద్ర, మార్క్‌ఫెడ్ డీఎం వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఇళ్ల కోసం 26,302 దరఖాస్తులు

- నేటితో ముగియనున్న గడువు

విజయనగరం కలెక్టరేట్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): సొంత స్థలాలు ఉండి.. ఇళ్ల నిర్మాణం కోసం జిల్లా వ్యాప్తంగా 26,302 దరఖాస్తులు వచ్చాయి. ఈ పథకం కింద దరఖాస్తు చేయడానికి ఆదివారంతో గడువు ముగియనుంది. ఈ నేపథ్యంలో శనివారం ఒక్క రోజు 5,300 మంది దరఖాస్తు చేసుకున్నారు. గత నెల రోజుల నుంచి గ్రామాల వారీగా ఆవాస్ యోజన పథకానికి అర్హులైన వారి నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నారు. సంబంధిత అధికారులు స్థలాల వద్దకు వెళ్లి జియోట్యాగింగ్ చేస్తున్నారు.

సమస్యలను పార్లమెంటులో ప్రస్తావిస్తా

- ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు

విజయనగరం రూరల్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): వచ్చే నెల 1 నుంచి ప్రారంభమయ్యే పార్లమెంటు శీతాకాల సమావేశాల్లో తన పరిధిలోని వివిధ సమస్యలను ప్రస్తావిస్తానని ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు చెప్పారు. శనివారం పార్టీ కార్యాలయంలో ఆయన విలేకర్లతో మాట్లాడారు. రాష్ట్ర ప్రయోజనాల దృష్ట్యా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు చెప్పిన సూచనలు, సలహాలను అనుసరించి విజయనగరం పార్లమెంటరీ పరిధిలో అభివృద్ధికి, మౌలిక సదుపాయాల కల్పనకు కేంద్ర సహకారం అందేలా కృషి చేస్తానని అన్నారు. సమావేశంలో టీడీపీ నాయకులు విజ్జపు ప్రసాద్, ప్రసాద్, సీహెచ్ సంతోష్, ఆల్తి బంగారుబాబు, పి.అప్పలనాయుడు, కోదండరామ్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీ కలిశెట్టి

'ఈ-సాక్ష్య'ం.. ఎంతో అవసరం

- అనుమానిత వ్యక్తుల వేలిముద్రలు తనిఖీ చేయండి
- నేర సమీక్షా సమావేశంలో ఎస్పీ దామోదర్



సమావేశంలో మాట్లాడుతున్న ఎస్పీ దామోదర్

విజయనగరం క్రైం, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని వివిధ పోలీసు స్టేషన్ల పరధిలో కేసుల దర్యాప్తు సమయంలో ఈ-సాక్ష్య యాప్‌ను వినియోగించాలని.. ఫొటోలు, వీడియోలను నిక్షిప్తం చేయాలని ఎస్పీ ఏఆర్ దామోదర్ పోలీసు అధికారులను ఆదేశించారు. శనివారం జిల్లా పోలీసు కార్యాలయంలోని సమావేశ మందిరంలో పోలీసు అధికారులతో నేర సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేసుల దర్యాప్తుల వివరాలను ఎప్పటికప్పుడు సీసీటీఎన్ఎస్‌లో అప్‌లోడ్ చేయాలని ఆదేశించారు. దీనిపై పోలీసు స్టేషన్ స్థాయిలో ప్రత్యేక శ్రద్ధ చూపాలన్నారు. సైబర్, మహిళల భద్రత పట్ల క్షేత్రస్థాయిలో అవగాహన కల్పించాలన్నారు. మైనర్ డ్రైవింగ్, హెల్మెట్‌ధారణ, డ్రంక్ అండ్ డ్రైవ్, ఓపెన్ డ్రింకింగ్‌పై ప్రత్యేక దృష్టి పెట్టి కేసులు నమోదు చేయాలని ఆదేశించారు.

నేరచరిత్ర గల వారిపై దృష్టి..

నేర చరిత్ర కలిగిన వ్యక్తులు, పాత నేరస్థుల కదలికలపై నిఘా పెట్టాలని ఎస్పీ సూచించారు. దొంగతనం కేసు నమోదైన వెంటనే సంబంధిత పోలీసు అధికారులు, సీసీఎస్ పోలీసులు సమన్వయంతో పనిచేసి వాటిని ఛేదించేందుకు కృషి చేయాలన్నారు. రాత్రి సమయంలో గస్తీ ముమ్మరం చేయాలని స్పష్టం చేశారు. ఆర్టీసీ కాంప్లెక్స్, రైల్వే స్టేషన్‌తో పాటు నగరంలోని ప్రధాన కూడళ్లలో నిఘా పెట్టాలన్నారు. గ్రామ స్థాయిలో గంజాయి తాగే వారిని గుర్తించి, వారికి దానిని విక్రయించే వారిపై కేసులు నమోదు చేయాలన్నారు.

అవాస్తవాలు ప్రచారం చేస్తే కేసులు..

సోషల్ మీడియాలో అవాస్తవాలను ప్రచారం చేసి ప్రజలను భయభ్రాంతులను గురిచేసే వారు, పోస్టులు పెట్టే వారిపై కేసులు నమోదు చేయాలని ఆదేశించారు. స్టేషన్‌కు వచ్చే బాధితులతో స్నేహపూర్వకంగా వ్యవహరించాలన్నారు. తప్పిపోయిన వ్యక్తులను గుర్తించాలని... నాన్‌బెయిల్‌బుల్ వారెంట్లను ఎగ్జిక్యూట్ చేసేందుకు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో ఏఎస్పీలు సౌమ్యలత, నాగేశ్వరరావు, డీఎస్పీలు గోవిందరావు, భవ్యరెడ్డి, రాఘవులు, వీరకుమార్, న్యాయసలహాదారు పరుశురామ్ తదితరులు పాల్గొన్నారు.

150 ప్రాంతాలు.. వెయ్యి మంది పోలీసులు

- నగరంలో విస్తృతంగా వాహన తనిఖీలు

విజయనగరం క్రైం, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): నగరంలో నేరాల నియంత్రణ, శాంతిభద్రతల పరిరక్షణ... రహదారి భద్రతలో భాగంగా ఎస్పీ ఏఆర్ దామోదర్ శనివారం 1000 మంది పోలీసులతో 150 ప్రాంతాల్లో వాహన తనిఖీలు చేపట్టారు. పత్రాలు సరిగా లేని వాహనాలను సీజ్ చేశారరు. హెల్మెట్ ధరించని వారిపై కేసులు నమోదు చేశారు. నగరంలోని మయూరి కూడలి, అంబేడ్కర్ కూడలి, ఆర్టీసీ కాంప్లెక్స్ గంటస్తంభం, మూడులాంతర్లు తదితర కూడళ్లలో ఈ తనిఖీలు జరిగాయి. ఎస్పీ ఏఆర్ దామోదర్ తనిఖీలను పర్యవేక్షించారు. ప్రమాద సమయంలో బాధితులను గోల్డెన్ అవర్‌లో ఆస్పత్రుల్లో చేర్పించిన వారికి రూ.5 వేల నగదును ప్రొత్సాహంగా అందిస్తామని తెలిపారు. ఈ తనిఖీల్లో ఇద్దరు అదనపు ఎస్పీలు, అయిదుగురు డీఎస్పీలు, 30 మంది సీఐలు, 100 మంది ఎస్ఐలతో సహా సుమారు వెయ్యి మంది సిబ్బందిని వినియోగించామన్నారు. సైలెన్సర్‌లను మార్పు చేసి శబ్ద కాలుష్యానికి కారణమవుతున్న వాహనాలను కూడా సీజ్ చేశామని తెలిపారు.

కార్యకర్తలు సైనికుల్లా పనిచేయాలి

● మంత్రి కొండపల్లి శ్రీనివాస్

బొండపల్లి(గజపతినగరం), నవంబరు 29(ఆంధ్రజ్యోతి): ప్రజల సమస్యల పరిష్కారానికి కార్యకర్తలు సైనికుల్లా పనిచేయాలని మంత్రి కొండపల్లి శ్రీనివాస్ పిలుపునిచ్చారు.ప్రతి ఒక్కరి సమస్య పరిష్కరించేందుకు వారంలో ఒకరోజు మండల స్థాయి ప్రజాదర్బార్ నిర్వహించేందుకు శ్రీకారం చుట్టామనితెలిపారు.శనివారం గజపతినగరంలోని నియోజకవర్గ పార్టీ కార్యాలయంలో ప్రజాదర్బార్ నిర్వహించారు. బొండపల్లి, గజపతినగరం, దత్తిరాజేరు, గంట్యాడ, జామి మండలాలకు చెందిన 14 మంది సీఎం సహాయనిధికి సంబంధించి రూ.14 లక్షల 7వేల 297లు చెక్కులను అందజేశారు. అనంతరం 55 మంది నుంచి అర్జీలు స్వీకరించారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్, వైస్ చైర్మన్‌లు పీవీవీ గోపాలరాజు, కోరాడ కృష్ణ, బొండపల్లి, గజపతినగరం, గంట్యాడ, దత్తిరాజేరు మండలాల టీడీపీ అధ్యక్షులు రాపాక అచ్చెంనాయుడు,గంట్యాడ శ్రీదేవి, కొండపల్లి భాస్కరనాయుడు, చప్పాచంద్రశేఖర్, మక్కువ శ్రీధర్, ముంజేటి పార్వతి పాల్గొన్నారు.


బొండపల్లి మండలంలోని కొండకిండాం బాధితులకు సీఎంఆర్ఎఫ్ చెక్కు అందజేస్తున్న మంత్రి శ్రీనివాస్

రైతుల సంక్షేమమే ధ్యేయం

● జిల్లాలో రైతన్నా-మీకోసం వారోత్సవాలు

రైతు సంక్షేమమే కూటమి ప్రభుత్వ ధ్యేయమని ప్రజాప్రతినిధులు, అధికారులు తెలిపారు. శనివారం జిల్లాలో పలు చోట్ల వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో రైతన్న-మీకోసం వారోత్సవాలను అధికారులు, కూటమి నాయకులు నిర్వహించారు.

●శృంగవరపుకోట (వేపాడ), నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): వ్యవసాయాన్ని లాభదాయకంగా మార్చడమే ప్రభుత్వ ధ్యేయమని ఎస్.కోట ఎమ్మెల్యే కోళ్ల లలిత కుమారి తెలిపారు. వేపాడ మండలంలోని సోంపురంలో జరిగిన రైతన్నా మీకోసం ఆమె మాట్లాడుతూ అధిక లాభాలు వచ్చే పంటలను సాగు చేయాలని రైతులకు సూచించారు.కార్యక్రమంలో ఏవో ఎం.స్వాతి, గిరిజన కార్పొరేషన్ డైరెక్టర్ దాసరి లక్ష్మి, టీడీపీ నాయకులు గొర్రిపాటిరాము, బుద్ద అప్పలనాయుడు, మల్ల వెంకటరమణ, దుల్లవెంకటరావు పాల్గొన్నారు.

●నెల్లిమర్ల, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను తెలుసుకుని పంటఉత్పత్తి పెంపు,మార్కెట్ సదుపాయాల విస్తరణ, ధాన్యం కొనుగోళ్లపై ప్రభుత్వం తరపున పూర్తి సహకారం అందజేస్తామని ఏపీ మార్క్‌ఫెడ్ చైర్మన్, టీడీపీ నెల్లిమర్ల నియోజకవర్గ ఇన్‌చార్జి కర్రోతు బంగార్రాజు హామీఇచ్చారు. మండలంలోని కొండవెలగాడలో జరిగిన రైతన్నా-మీ కోసం కార్యక్రమంలో రైతులకు ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను వివరించారు. కార్యక్రమంలో టీడీపీ జిల్లా అధికార ప్రతినిధిగేదెల రాజారావు, కొండవెలగాడ టీడీపీ నాయకులు దంతులూరి అజయ్‌బాబు, మొయిద సత్యనారాయణ, కాళ్ల రాజశేఖర్ పాల్గొన్నారు.


నెల్లిమర్ల: కొండవెలగాడలో రైతన్నా-మీ కోసం కరపత్రాలను ఆవిష్కరిస్తున్న మార్క్‌ఫెడ్ చైర్మన్ బంగార్రాజు


శృంగవరపుకోట: సోంపురంలో రైతన్నా-మీకోసం కరపత్రాలను ప్రదర్శిస్తున్న ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి

వేర్వేరు ఘటనల్లో ఇద్దరి మృతి

గుర్ల, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): మండలంలోని శనివారం వేర్వేరు ఘటనల్లో ఇద్దరు మృతిచెందారు. ఎస్ఐ నారాయణరావు కథనం మేరకు.. శుక్రవారం సాయంత్రం చుక్కపేట సెంటర్ వద్ద కలవచర్ల గ్రామానికి చెందిన నడుపూరు నరసయ్యమ్మ(65) ఆమె కోడలితో చీపురుపల్లి మానసాదేవి ఆలయానికి స్కూటీపై వెళ్తుండగా ప్రమాదవశాత్తు బైక్ మీద నుంచి కిందపడి గాయాలపాలైంది. ఈమేరకు ఆమె విజయనగరంలోని ఆసుపత్రికి తరలించగా చికిత్సపొందుతూ శనివారం మృతిచెందింది. అలాగే ఎస్ఎస్ఆర్‌పేట వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో గుర్తుతెలియని వ్యక్తి మృతిచెందాడు. ద్విచక్రవాహనంపై చీపురుపల్లికి చెందిన వ్యాపారి ఇప్పిలి నాగభూషణరావు (53) స్వగ్రామం వస్తుండగా ఎస్ఎస్ఆర్‌పేట వద్ద వాహనం ఢీకొంది.రోడ్డుపై మృతదేహం పడిఉండగా సమాచారం మేరకు ఎస్ఐ వెళ్లి పరిశీలించారు. అనంతరం మృతదేహాన్ని విజయనగరం ఆస్పత్రికి తరలించారు. ఈమేరకు కేసులు నమోదుచేసి పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

ఇద్దరిపై డ్రంకెన్ డ్రైవ్ కేసుల నమోదు

డెంకాడ, నవంబరు 29(ఆంధ్రజ్యోతి):మండలంలోని పెద్దతాడివాడ, అయినాడ, నాతవలస జంక్షన్‌లో సిబ్బందితో శనివారం ఎస్ఐ సన్యాసినాయుడు వాహనతనిఖీలు నిర్వహించారు.ఈసందర్భంగా 18 మంది వాహనచోదకులకు రూ.10,980లు అపరాధ రుసుము విధించడంతోపాటు ఇద్దరిపై డ్రంకెన్ డ్రైవ్ కేసులు నమోదు చేసిమూడు వాహనాలు సీజ్ చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

భూసేకరణ వివరాలు బయటపెట్టాలి

ఎస్.కోట రూరల్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): మండలంలో జిందాల్ కంపెనీ పేరుతో చేసిన భూసేకరణ వివరాలు బయటపెట్టాలని లోక్‌సత్తా పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు భీశెట్టి బాబ్జీ కోరారు.ఈమేరకు కేఆర్‌సీ డిప్యూటీ కలెక్టర్, జిందాల్ భూసమస్యల పరిష్కార ప్రత్యేకాధికారి మురళికి శనివారం వినతిపత్రం అందజేశారు.ఈ సందర్భంగా బాబ్జీ మాట్లాడుతూ కర్మాగారం కోసం సేకరించిన 1,128 ఎకరాల వివరాలపై ఆ ప్రాంత ప్రజలు, రైతులకు తెలియజేయాలని కోరారు. అమ్మపాలెం, దెప్పురు, బందవలస గ్రామాల్లో భూములు తమవేనని జిందాల్ యాజమాన్యం బెదిరిస్తోందని, దీనిపై ప్రజలకు పూర్తిగా సమాచారం ఇస్తే వారిలో అపోహలు తొలగిపోతాయని తెలిపారు.

స్మార్ట్ కిచెన్ల ఏర్పాటును విరమించుకోవాలి

రాజాం రూరల్, నవంబరు 29(ఆంధ్రజ్యోతి):మధ్యాహ్న భోజనపథకం నిర్వహణలో భాగంగా స్మార్ట్‌కిచెన్ల ఏర్పాటును రాష్ట్ర ప్రభుత్వం విరమించుకోవాలని ఎండీఎం నిర్వాహకుల సంఘ నాయకుడు రామ్మూర్తినాయుడు శనివారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. ఈ పథకాన్ని ప్రైవేటు వ్యక్తులకు అప్పగించే చర్యల్లో భాగంగా మండలానికో స్మార్ట్‌కిచెన్‌ను ఏర్పాటు చేయాలని నిర్ణయించడం తగదని పేర్కొన్నారు. రెండు దశాబ్దాలుగా కనీసవేతనాలకు నోచుకోక పథకాన్ని కొనసాగిస్తూ వస్తున్న నిర్వాహకులకు అన్యాయం చేస్తే పోరాటం చేయకతప్పదని హెచ్చరించారు.

పదో తరగతి పరీక్ష ఫీజు గడువు పెంపు

రాజాం రూరల్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): పదోతరగతి పరీక్షల ఫీజు గడువును పెంచుతూ విద్యాశాఖ ఉత్తర్వులు విడుదల చేసింది. వచ్చేఏడాది మార్చి 16 నుంచి 30వ తేదీ వరకు జరిగే ఈ పరీక్షలకు వాస్తవానికి ఆదివారంలోగా ఫీజు చెల్లించాల్సి ఉంది. అయితే తాజాగా ఈ గడువును డిసెంబరు ఆరో తేదీ వరకూ గడువు పొడిగిస్తూ విద్యాశాఖ విడుదలచేసిన ఉత్తర్వుల్లో స్పష్టంచేసిందని డీఈవో మాణిక్యంనాయుడు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పరీక్షఫీజు రూ.125గా నిర్ణయించగా, డిసెంబరు ఏడు నుంచి తొమ్మిది వరకూ రూ.50, 10 నుంచి 12 వరకూ రూ.200, 13 నుంచి 15 వరకూ రూ.500 అపరాద రుసుముతో ఫీజు చెల్లించవచ్చని ఉత్తర్వుల్లో వివరించారు. విద్యార్థులు హాల్‌టికెట్‌లో పేరు, ఇతర వివరాలు ఒకటికి రెండుసార్లు పరిశీలించి సక్రమంగా నమోదు చేయాలని డీఈవో సూచించారు. పొరపాటు విద్యార్థులు తప్పుగా నమోదుచేస్తే సవరించుకునేందుకు డిసెంబరు 16 నుంచి 20 వరకు అవకాశముందని పేర్కొన్నారు.

రానున్న ఎన్నికల్లో గెలుపు తథ్యం

గుర్ల, నవంబరు29(ఆంధ్రజ్యోతి):సీఎం చంద్రబాబునాయుడు చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమకార్యక్రమాల వల్ల రానున్న స్థానికసంస్థల ఎన్నికల్లో గెలుపు తథ్యమని టీడీపీ జిల్లా అధికార ప్రతినిధి గేదెల రాజారావు తెలిపారు. శనివారం మండలంలోని పాలవలసలో ఉన్న బూత్ కన్వీనర్లు, గ్రామపెద్దలతో సమావేశం ఏర్పాటుచేశారు. కార్యక్రమంలో టీడీపీ గుర్ల మండలాధ్యక్షులు చనమల్లు మహేష్, నాయకులు, సుంకరిరమణమూర్తి, బంగారునాయుడు, గేదెల అప్పలనాయుడు, సుంకరి ఉపేంద్ర, వల్లూరు చిన్నంనాయుడు, తాడ్డి నారాయణరావు పాల్గొన్నారు.

ఆదాయాన్ని మెరుగుపరచుకోవాలి: డీడీవో


రికార్డులు తనిఖీ చేస్తున్న రోజారాణి

డెంకాడ, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): ఆదాయ నిర్వహణ మెరుగుపరచుకోవాలని విజయనగరం డివిజన్ డవలప్‌మెంట్ అధికారి రోజారాణి కోరారు. శనివారం మండలంలోని గంట్లాం పంచాయతీలో రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా పంచాయతీ రికార్డుల్లో అవకతవకలు, ముందస్తు ప్రణాళిక లోపాలు, పారిశుధ్యం, తాగునీరు సక్రమంగా ప్రజలకు అందకపోవడం వంటి లోపాలను గుర్తించారు. ఫంక్షనల్ కమిటీలన్నీ ఏర్పాటుచేయాలని ఆదేశించారు. పంచాయతీ పలు అంశాల్లో వెనుకబడి ఉన్నా డిప్యూటీ ఎంపీడీవో రెగ్యులర్‌గా పరిశీలించకపోవడంపై మండిపడ్డారు. ఆమె వెంట డిప్యూటీ ఎంపీడీవో శ్రీనివాసరావు, సచివాలయ సిబ్బంది ఉన్నారు.

స్వదేశీ వస్తువులు వినియోగించాలి

విజయనగరం బాబామెట్ట, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విదేశీ వస్తువులను బహిష్కరించి, స్వదేశీ వస్తువులను వినియోగించి దేశ సంపద కాపాడి రైతులకు అండగా ఉండాలని దక్షిణ మధ్య సంయోజన స్వదేశీ ప్రముఖ్ డాక్టరు లింగరాజు డిమాండ్ చేశారు. శనివారం విజయనగరంలోని అంబేడ్కర్ జంక్షన్ నుంచి కోట జంక్షన్, మూడు లాంతర్లు గంటస్తంభం మీదుగా స్వదేశీ జాగరణ మంచ్ విభాగం ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో సంస్థ ప్రతినిధులు రాజేష్, హనుమంతు శేషగిరి పాల్గొన్నారు.

రేపు గీతాయజ్ఞం

రాజాం రూరల్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని దేవదాయశాఖ పరిధిలోని రమణసత్యానంద నిలయంలోని పంచదేవతా మందిరంలో సోమవారం గీతాయజ్ఞం నిర్వహించనున్నట్లు పోలిపల్లి పైడి తల్లి దేవస్థానం ఈవో బీవీ మాధవరావు ఒకప్రకటనలో తెలిపారు. వేదపండితుల ఆధ్వర్యంలో నిర్వహించనున్న ఈ కార్యక్రమంలో హోమం, జప, అర్చనలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.

స్వామిత్వ గ్రామసభ

రేగిడి, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): పంచాయతీల్లో నిర్వహిస్తున్న స్వామిత్వ సర్వేతో గ్రామకంఠాలపై యాజమానులకు పూర్తి హక్కులు లభిస్తాయని డిప్యూటీ ఎంపీడీవో జగన్నాథరావు తెలిపారు. శనివారం మండలంలో వప్పంగిలో సర్పంచ్ గంటా మోహన్ అధ్యక్షతన స్వామిత్వపై గ్రామసభ నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ శకుంతలమ్మ, కార్యదర్శి సురేష్ పాల్గొన్నారు.

పెన్షనర్ల సలహాలు ఇవ్వాలి

కొత్తవలస, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): పెన్షనర్ల సలహాలు తీసుకుని పనిచేస్తామని కొత్తవలస ఇన్‌చార్జి తహసీల్దార్ సునీత తెలిపారు. శనివారం కొత్తవలసలోని రాష్ట్రప్రభుత్వ పెన్షనర్ల సంఘ సమావేశం సంఘ అధ్యక్షుడు కె.వెంకటేశ్వర్లు అధ్యక్షతన జరిగింది. కార్యక్రమంలో సంఘం గౌరవాధ్యక్షుడు అప్పారావు, ప్రసాదరావు పాల్గొన్నారు.

రాజాం ఎస్ఐ బదిలీ

రాజాం రూరల్,నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): రాజాం టౌన్ ఎస్ఐగా విధులు నిర్వహిస్తున్న రవికిరణ్‌ను విశాఖ సిటీకి బదిలీ చేస్తూ పోలీస్‌శాఖ ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీచేశారు. ఈమేరకు రవికిరణ్ దంపతులను చీపురుపల్లి డీఎస్పీ రాఘవులు, రాజాం టౌన్, రూరల్ సీఐలు అశోక్‌కుమార్, ఉపేంద్రరావు సన్మానించారు.

అండర్-14 క్రికెట్ జట్టు పరిశీలకుడిగా బంగార్రాజు

విజయనగరం టౌన్, నవంబరు29 (ఆంధ్రజ్యోతి): విజయనగరంలోని గాజులరేగ ప్రభుత్వోన్నత పాఠశాల పీఈటీ పెనుమత్స బంగార్రాజును అండర్-14స్కూల్‌గేమ్స్ రాష్ట్ర క్రికెట్ జట్టు పరిశీలకుడిగా నియమిస్తూ డీఈవో మాణిక్యాలరావు ఉత్తర్వులు జారీ చేశారు. ఈమేరకు శని, ఆదివారాల్లో గుంటూరు జిల్లా పెరిశర్లలో నిర్వహించే రాష్ట్రస్థాయి పోటీలను పరిశీలించనున్నట్లు మాణిక్యాలరావు ఒక ప్రకటనలో తెలిపారు

కోచ్‌గా రతన్

జిల్లాకు చెందిన రతన్‌ను అండర్- 16 రాష్ట్ర క్రికెట్ జట్టు కండీషనింగ్ అండ్ స్ట్రెంథ్ కోచ్‌గానియమించినట్లు ఆంధ్రాక్రికెట్ అసోసియేషన్ కార్యదర్శి వాసుదేవరాజు ఒక ప్రకటనలో తెలిపారు. రతన్‌ను పీవీజీ రాజు నార్త్ జోన్ క్రికెట్ అకాడమీ చైర్మ న్, కన్వీనర్ కోచ్ అభినందించారు.

క్రీడాకారులకు అభినందన

ఉత్తరప్రదేశ్‌లోని బరేలిలో ఈనెల 21 నుంచి 23 వరకూ జరిగిన క్యాడెట్ జాతీయ స్థాయి పోటీల్లో జిల్లా నుంచి ప్రాతినిధ్యం వహించి ప్రతిభ కనబరిచి పతకాలు సాధించిన ఐదుగురు క్రీడాకారులను శనివారం జిల్లా ఒలింపిక్‌అధ్యక్షుడు గురానా అయ్యలు అభినందించారు. కార్యక్రమంలో రాష్ట్ర తైక్వాండో అసోసియేషన్ కార్యదర్శి సి.హెచ్ వేణుగోపాల్,ఎంఎస్ఎన్‌రాజు,కోచ్ యశస్విని పాల్గొన్నారు.

వైకుంఠ ఏకాదశికి ఏర్పాట్లు

కొత్తవలస, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): కొత్తవలస పంచాయతీ గిడిజాల రోడ్డులోని ఎన్టీఓ కాలనీ సమీపంలోని గరుడాద్రి కొండపై వెలసిన వేంకటేశ్వర స్వామి ఆలయంలో ప్రతి శనివారం మధ్యాహ్నం అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు ధర్మకర్త బోని వెంకటఅప్పారావు తెలిపారు. ఈమేరకు శనివారం అన్నదాన కార్యక్ర మం ప్రారంభించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ వైకుంఠ ఏకాదశమి పురస్కరించుకుని ప్రత్యేక పూజల నిర్వహణకు ఏర్పాట్లు చేస్తున్నామని తెలిపారు. టీటీడీ ఆలయం మాదిరిగా ఏడు ద్వారాల ఏర్పాటు, ఎనిమిది శక్తిపీఠాలకు సంబంధించి విగ్రహాలు ప్రతిష్ఠించనున్నట్లు చెప్పారు.

గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి చర్యలు

● నెల్లిమర్ల ఎమ్మెల్యే లోకం నాగమాధవి


జనసేనలోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే నాగమాధవి

భోగాపురం, నవంబరు29(ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి చర్యలు చేపడతామని నెల్లిమర్ల ఎమ్మెల్యే లోకం నాగమాధవి తెలిపారు. శనివారం భోగాపురంలోని జనసేన పార్టీ కార్యాలయంలో తంగుడిబిల్లికి చెందిన రెడ్డినారాయణరావు, చందకఅప్పలనాయుడు, పల్లిశ్రీను, తదితర 60 కుటుంబాలు జనసేనలో చేరాయి. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామాలు అభివృద్ధి, ప్రజా సేవా కార్యక్రమాలు, నిరంతరం ప్రజల్లో ఉండడం చూసి ప్రజలు పార్టీలో చేరుతున్నారని తెలిపారు.

రాష్ట్రాభివృద్ధికి చంద్రబాబు కృషి

● శృంగవరపుకోట ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి

జామి,నవంబరు 29(ఆంధ్రజ్యోతి):రాష్ట్రాభివృద్ధికి చంద్రబాబు కృషిచేస్తున్నారని శృంగవరపుకోట ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి తెలిపారు. శనివారం జామిలో నిర్వహించిన ప్రజావేదికలో 151మంది వినతులు అందజేశారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రజాదర్బార్‌లో ప్రజలుచేసిన ఫిర్యాదులను వేగవంతంగా పరిష్కరించాలని కోరారు. సీఎం చంద్రబాబునాయుడు,ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్,మంత్రి లోకేష్‌బాబు అభి వృద్ధి, సంక్షేమంకోసం అహర్నిశలు శ్రమిస్తున్నారన్నారు.ప్రజాసమస్యలు క్షేత్రస్థాయిలో తెలుసుకొని పరిష్కరించాలని ముఖ్యమంత్రి తమను ఆదేశించడంతో ప్రజాదర్బార్‌ద్వారా తెలుసుకొని ప్రజలకు తాము అండగా ఉంటున్నామని తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ మండలాధ్యక్షులు వర్రి రమణ,స్వామినాయుడు, రాయవరపు రవి, వెలమకార్పొరేషన్ డైరెక్టర్ శ్రీలక్ష్మి, బీజేపీ మండలాధ్యక్షురాలు ఆదిలక్ష్మి పాల్గొన్నారు.

కోనూరు పీహెచ్‌సీ వైద్యాధికారిపై విచారణ

గరివిడి, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): మండలంలోని కోనూరు పీహెచ్‌సీ వైద్యాధికారి వెంకట రమణమ్మను జిల్లా వైద్య ఆరోగ్యశాఖ ప్రోగ్రాం అధికారి సుబ్రహ్మణ్యం శనివారంవిచారణ నిర్వహించారు. కోనూరు పీహెచ్‌సీ వైద్యాధికారి వెంకట రమణమ్మ ఆసుపత్రి విధులకు డుమ్మా కొడుతూ అక్రమాలకు పాల్పడుతున్నారని మాజీ సర్పంచ్ వెంపడాపు రమణమూర్తి, ఎం.అప్పలనాయుడు, వై.రమణ, ఎం.రాము తదితరులు కలెక్టర్, జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారికి ఫిర్యాదుచేశారు. దీంతో జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి జీవనరాణి విచారణకు ఆదేశిస్తూ విచారణ అధికారిగా సుబ్రహ్మణ్యాన్ని నియమించారు. విచారణలో స్టేట్‌మెంట్ రికార్డు చేసుకొని జిల్లా వైద్యాధికారికి నివేదిక ఇస్తానని విచారణాధికారి తెలిపారు.

కోరుకొండ సైనిక స్కూల్ వార్షికోత్సవం

విజయనగరం రూరల్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): కోరుకొండ సైనిక స్కూల్‌లో శనివారం ఆ పాఠశాల వార్షికోత్సవం, తల్లిదండ్రుల దినోత్సవం ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా పలు సాంస్కృతిక ప్రదర్శనలు, సాహస విన్యాసాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. పాఠశాల ప్రిన్సిపాల్ గ్రూప్ కెప్టెన్ ఎస్ఎస్ శాస్త్రి వార్షిక నివేదికను సమర్పించారు. వార్షిక అథ్లెటిక్ మీట్ సందర్భంగా వార్షిక అథ్లెట్ మీట్ ముగింపు సజావుగా జరిగినట్లు నిర్వాహకులు తెలిపారు. వివిధ ప్రదర్శనలు ప్రతిభ చూపిన విద్యార్థులకు ట్రోఫీతోపాటు ప్రశంసాపత్రాలను అందజేశారు.ఈ కార్యక్రమానికి విశాఖ తూర్పు నావికదళం కమాండెంట్ చీఫ్ ఆఫ్ స్టాఫ్, నౌసేన మెడల్ గ్రహీత రియల్ అడ్మిరల్ ఎం.మురళీమోహన్‌రాజు ముఖ్య అతిథిగా హాజరయ్యారు.

పేదలకు ఇళ్ల పట్టాలిచ్చే వరకూ పోరాటం

విజయనగరం దాసన్నపేట, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): ధర్మపురిలోని సర్వే నెంబరు 86లో పేదలకు ఇళ్ల పట్టాలిచ్చే వరకూ పోరాడుతామని బడుగు, బలహీన వర్గాల సంక్షేమ సంఘం అధ్యక్షుడు రెడ్డి నారాయణరావు తేల్చిచెప్పారు. శనివారం ధర్మపురిలో పేదలకు ఇళ్ల పట్టాలివ్వాలని కోరుతూ నిరసన కార్యక్రమం చేపట్టారు, ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రభుత్వ భూమిలో బడుగు, బలహీనవర్గాల, నిరుపేదలకు పట్టాలు ఇవ్వాలని కలెక్టరేట్, తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నాలు చేసిన అనంతరం వీఆర్వోతో విచారణ జరిపి 60 మందిని ఎంపిక చేశారని తెలిపారు. కొంత మంది అర్హులు ఉన్నారని, వారికి కూడా పట్టాలివ్వాలని కోరారు.

ఇళ్లస్థలాలు కేటాయించండి

ఎస్.కోట రూరల్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి):తిమిడిలో ఇళ్లు లేని పేదలకు స్థలాలు కేటాయించాలని జనసేన నాయకుడు ఒబ్బిన సన్యాసినాయుడు కోరారు. ఈ మేరకు ఇళ్లలేని పేదలతో సచివాలయం సిబ్బందిని కలిసి వినతిపత్రం ఇచ్చారు.

ఇళ్లకు పన్నులు వేయాలి

విజయనగరం దాసన్నపేట, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): నగరంలోని పూల్‌బాగ్ వీజీ కళాశాల ఎదుటగల పేదల ఇళ్లకు పన్నులు వేయాలని, పట్టాలు ఇవ్వాలని సీపీఎం నగర కార్యదర్శి రెడ్డి శంకరరావు డిమాండ్ చేశారు. శనివారం విజయనగరంలోని రెండో డివిజన్ సచివాలయం వద్ద పన్నులు వేయాలని, పట్టాలివ్వాలని కోరుతూ నిరసన తెలిపారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 59 ఏళ్లుగా వీజీ కళాశాల ఎదురుగా పూరిళ్లలో నివాసముంటున్న పేదలకు ఇప్పటివరకూ ఇంటి పన్నులు వేయలేదన్నారు. కార్యక్రమంలో దాలయ్య, సన్ని, రాజు పాల్గొన్నారు.

ప్రథమ చికిత్సపై విద్యార్థులకు అవగాహన

శృంగవరపుకోట, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): ఎస్.కోట ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులకు శనివారం రెడ్‌క్రాస్ సొసైటీ ప్రథమ చికిత్సపై అవగాహన కల్పించింది. ఈ సందర్భంగా ఐ డోనేషన్ విధాన్ని వివరించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ కృష్ణమూర్తి, రెడ్‌క్రాస్ ప్రతినిధులు డాక్టర్ వరలక్ష్మి, సూర్యారావు, మన్మథరావు పాల్గొన్నారు.

ఆన్‌లైన్ బెట్టింగ్ యాప్‌లను రద్దు చేయాలి


నిరసన తెలుపుతున్న ఏఐవైఎఫ్ ప్రతినిధులు

విజయనగరం దాసన్నపేట, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి):ఆన్‌లైన్ బెట్టింగ్ యాప్‌లను రద్దుచేయాలని ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షుడు బూర వాసు డిమాండ్ చేశారు. శనివారం విజయనగరంలోని ఆర్టీసీ కాంప్లెక్స్ ఎదుట ఆన్‌లైన్ బెట్టింగ్ యాపులను రద్దు చేయాలని నిరసన తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ యాప్‌ల యాజమాన్యాలు తక్కువ ధరకే వడ్డీకి ఇస్తామని, బెట్టింగ్‌కు తగినంత మొత్తం ఇస్తామని చెప్పడంతో నమ్మిన యువత డౌన్‌లోడ్ చేసుకుని వాటికి బానిసలు అవుతున్నారని తెలిపారు. తీసుకున్న తరువాత వడ్డీలు కట్టలేక జీవితాలు నాశనం చేసుకుంటున్నారని ఆందోళన వ్యక్తంచేశారు. తక్షణమే యాపులను రద్దుచేసి యువతకు, ఆడపిల్లలకు రక్షణ కల్పించకపోతే ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

పాలిథిన్‌ను వినియోగించవద్దు: కమిషనర్

రాజాం రూరల్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో ప్లాస్టిక్, పాలిథిన్ వినియోగానికి ప్రజలు దూరంగా ఉంచాలని రాజాం మునిసిపల్ కమిషనర్ రామచంద్రరావు సూచించారు. శనివారం కస్పావీధి, బుక్కావీధి, చిక్కాలవీధుల్లో వికాసతరంగిణి సంస్థ సమకూర్చిన 350 గుడ్డ సంచులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో వికాస తరంగిణి రాష్ట్ర కమిటీ ప్రతినిధి టీటీవీ రమణమూర్తి, అధ్యక్షులు వాకచర్ల పైడిరాజు, టంకాల వెంకటేశం పాల్గొన్నారు.

బాల్య వివాహాల నిర్మూలనపై అవగాహన

రాజాం, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రాజీయ్యపేట,రాజీయ్యపేట, మారేడుబాక, ఒమ్మిలో బాల్య వివాహాల నిర్మూలనపై శనివారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎన్‌జీవో సంఘం ప్రతినిధి డి.పద్మా తదితరులు కొవ్వొత్తుల ర్యాలీని నిర్వహించారు. కార్యక్రమంలో సీసీ సరస్వతి, సీఎఫ్ జి.సంధ్యారాణి సత్యనారాయణ, పట్నాన రాజులమ్మ పాల్గొన్నారు.

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి

భోగాపురం, నవంబరు29(ఆంధ్రజ్యోతి):పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సీహెచ్‌సీ అభివృద్ధి కమిటీ సభ్యులు బొల్లుత్రినాథ్, కె.రాధాకృష్ణ రెడ్డి కోరారు. భోగాపురం పంచాయతీ పరిధిలోగల సుందరపేట సీహెచ్‌సీ ఆవరణలో శనివారం పొదలు, తుప్పలు తొలగించి పరిసరాలను చదును చేశారు. కార్యక్రమంలో జనసేన నాయకులు మాతా నవీన్ పాల్గొన్నారు.

న్యాయం చేయాలని నిర్వాసితుల నిరసన

ఎస్.కోట రూరల్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): జిందాల్ కంపెనీ జీవో- 892-2లో భూమి, ఇళ్లు కోల్పోయినవారికి ఉద్యోగాలిస్తామని చెప్పి ఇవ్వకపోవడంతో ఒక్కో నిర్వాసితుడు రూ.15లక్షల వరకు నష్టపోయారని నిర్వాసితులు వాపోయారు. శనివారానికి బొడ్డవర వద్ద జిందాల్ నిర్వాసితులు చేపట్టిన దీక్షలు 169రోజులకు చేరాయి. ఈ సందర్భంగా నిర్వాసితులు మాట్లాడుతూ తమకు ప్రభుత్వం అండగా లేదని తెలిపారు. ప్రభుత్వం స్పందించి తమకు న్యాయంచేయాలని నిరసన తెలిపారు.

వృద్ధులకు నేత్ర వైద్యపరీక్షలు

రాజాం రూరల్, నవంబరు 29 (ఆంధ్ర జ్యోతి): రాజాంలోని వృద్ధాశ్రమంలో వృద్ధులకు శనివారం ఆప్తాలమిక్ ఆఫీసర్, రొటేరియన్ సప్పటి వసంతరావు నేత్ర వైద్య పరీక్షలు నిర్వహించారు. మందులు, ఐ డ్రాప్స్‌ను అందజేశారు.కార్యక్రమంలో ఆశ్రమ నిర్వాహకులు ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులకు క్రీడా పోటీలు

జిల్లాలోని ఉపాధ్యాయులకు స్కూల్ గేమ్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో క్రికెట్, త్రోబాల్ తదితర క్రీడల్లో మండల స్థాయిలో ఎంపిక పోటీలు శనివారం నిర్వహించారు. ఆయా మండలాల్లో ఎంపికైన ఉపాధ్యాయులు డివిజన్ స్థాయి పోటీల్లో పాల్గొంటారని నిర్వాహకులు తెలివపారు.

రేగిడి, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి):ఏవీపురం హైస్కూల్‌లో ఉపాధ్యాయులకు మండలస్థాయి క్రీడాపోటీలు నిర్వహించారు. ఉపాధ్యాయులకు క్రికెట్, ఉపాధ్యాయినులకు త్రోబాల్ పోటీలు నిర్వహించి జట్లను ఎంపికచేశారు. ఈ సందర్భంగా ఎంఈవో వరప్రసాదరావు మాట్లాడుతూ త్వరలో డివిజనల్‌స్థాయి పోటీల్లో ఈ రెండు జట్లు ఆడనున్నట్లు తెలిపారు.

●సంతకవిటి, నవంబరు 29(ఆంధ్రజ్యోతి):సంతకవిటి ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో ఉపాధ్యాయులకు క్రీడాపోటీలు నిర్వహించారు. ఈ కార్య క్రమంలో ఎంఈవోలు బి.శాంతికుమారి, సీహెచ్ భాస్కరరావు పాల్గొన్నారు.

●భోగాపురం, నవంబరు29(ఆంధ్రజ్యోతి):భోగాపురం హైస్కూల్‌లో మండల స్థాయి ఉపాధ్యాయుల క్రీడాపోటీలు నిర్వహించారు. క్రికెట్‌లో 32 మంది పురుషులు పాల్గొనగా 16 మందిని ఎంపికచేశారు.త్రోబాల్‌లో 17 ఉపాధ్యాయినులు పాల్గొనగా 12 మందిని డివిజన్ స్థాయికి ఎంపిక చేశారు.ఈసందర్భంగా ఎంఈవోలు ఎం.రమణమూర్తి,బి.చంద్రమౌళి మాట్లాడుతూ మండలస్థాయిలో ఎంపికైన ఉపాధ్యాయ క్రీడాకారులు డివిజన్ స్థాయి పోటీల్లో పాల్గొంటారన్నారు.

● కొత్తవలస, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి) : వియ్యంపేటలోని అంబేడ్కర్ గురుకుల పాఠశాలలో స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఉపాధ్యాయులకు క్రికెట్, ఉపాధ్యాయినులకు త్రోబాల్ పోటీలను నిర్వహించి మండలస్థాయి టీములను ఎంపికచేశారు. కార్యక్రమంలో ఎంఈవోలు జి.శ్రీదేవి, బండారు శ్రీనివాసరావు, కో ఆర్డినేటర్ చంద్రశేఖర్, గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ లక్ష్మి పాల్గొన్నారు.

●రాజాం నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): రాజాంలోని జీసీఎస్ కాలేజీ మైదానంలో ఉపాధ్యాయులకు మండలస్థాయిలో క్రికెట్, త్రోబాల్ పోటీలు నిర్వహించారు. ఈ పోటీలకు100మంది హైస్కూల్‌స్థాయిలో ఉన్న ఉపాధ్యాయులు పాల్గొన్నారు. క్రికెట్‌లో 16 మంది, త్రోబాల్‌లో 12 మందికి చొప్పున డివిజన్ స్థాయి పోటీలకు ఎంపిక చేసినట్లు పీడీ సీమల రేణుకాసాయి తెలిపారు. ఎంపికైన క్రీడాకారులు డిసెంబరు 13, 14 తేదీల్లో నిర్వహిస్తున్న డివిజన్ స్థాయి పోటీలకు, డిసెంబరు 20, 21, 22 తేదీల్లో నిర్వహిస్తున్న జిల్లా పోటీలకు హాజరవుతారని పీడీ తెలిపారు, ఈ కార్యక్రమంలో ఎంఈవోలు.ప్రవీణ్‌కుమార్, దుర్గారావు, పీడీ అజయ్‌కుమార్ పాల్గొన్నారు,


రాజాం: డివిజన్‌స్థాయి పోటీలకు ఎంపికైన ఉపాధ్యాయులు

సాఫీగా రాకపోకలు సాగేనా?

(5వ పేజీ తరువాయి)

స్పష్టమైన ఆదేశాలు జారీ చేసింది. ఈ మేరకు జిల్లాలో సాలూరు నుంచి మక్కువ రోడ్డుకు త్వరలోనే మోక్షం కలగనుంది. పార్వతీపురం మండలంలో వెంకంపేట గోలీల నుంచి ఎంఆర్ నగరం రహదారి మరమ్మతు పనులు కూడా చేపట్టనున్నారు. మన్యంలో మరికొన్ని చోట్ల రోడ్డు రూపురేఖలు మారనున్నాయి. అయితే వాటి పనులను సంబంధిత అధికారులు పర్యవేక్షించాల్సి ఉంది. లేకుంటే మరమ్మతులు చేపట్టిన అనతికాలంలోనే రోడ్డు మళ్లీ యథాస్థితికి వచ్చే అవకాశం ఉంది. ఈ నేపథ్యంలో ఉన్నతాధికారులు వాటిపై దృష్టి సారించాలని జిల్లావాసులు కోరుతున్నారు.

పార్వతీపురాన్ని కార్పొరేషన్ స్థాయికి తీసుకెళ్లండి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే విజయచంద్ర

పార్వతీపురం, నవంబరు29 (ఆంధ్రజ్యోతి): పార్వతీపురం మున్సిపాలిటీని కార్పొరేషన్ స్థాయికి తీసుకెళ్లాలని మున్సిపల్ సిబ్బందిని ఎమ్మెల్యే విజయచంద్ర సూచించారు. శనివారం పార్వతీపురం మున్సిపల్ కార్యాలయంలో పట్టణంలోని 15 సచివాలయాల కార్యదర్శులతో ఆయన సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ స్థానిక మున్సిపాలిటీలో జరుగుతున్న ప్రతి పని విషయాన్ని అటు ప్రభుత్వానికి, ఇటు స్థానిక ప్రజా ప్రతినిధులకు తెలియజేయాలన్నారు. ఎటువంటి ఫిర్యాదులు రాకుండా చూడాలన్నారు. ముఖ్యంగా 1, 13, 19, 22, 25, 27 వార్డుల్లో పింఛన్ల పంపిణీలో ప్రజా ప్రతినిధులకు సమాచారం ఇవ్వడం లేదని ఫిర్యాదులు ఉన్నాయన్నారు. అలా జరగకుండా చూసుకోవాలని కార్యదర్శులకు సూచించారు. సమావేశంలో మున్సిపల్ కమిషనర్, పలువురు ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

24 గంటల్లో ధాన్యం బిల్లుల చెల్లింపు

●పార్వతీపురం రూరల్: ధాన్యం కొనుగోలు చేసిన 24 గంటల్లోనే చెల్లింపులు జరుపుతున్న పరిస్థితులపై నియోజక వర్గంలో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారని ఎమ్మెల్యే బోనెల విజయచంద్ర అన్నారు. పెద్ద బొండ పల్లిలో ఆయన శనివారం అన్నదాతా సుఖీభవ లబ్ధిదారులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. అధికారంలోకి వచ్చిన 18 నెలల్లోపే రైతులకు మేలు చేసే మంచి ప్రభుత్వంగా కూటమి ప్రభుత్వం పేరు తెచ్చుకుందన్నారు. రైతులకు అన్నదాత సుఖీభవ పథకం ద్వారా రూ.20 వేలతో పాటు రాయితీపై బిందు సేద్యం పరికరాలు, విత్తనాలు, ఎరువులు అందిస్తున్నామన్నారు. అనంతరం గ్రామంలో కళ్లాల్లో ధాన్యం నూర్పులు చేస్తున్న రైతుల దగ్గరకు వెళ్లి వారిని పలకరించి అన్నదాతా సుఖీభవ పథకం కోసం ఆరా తీశారు. కార్యక్రమంలో పీఏసీఎస్ ఛైర్మన్ గొరజాన చంద్రమౌళి, మాజీ సర్పంచ్ చుక్కా అచ్యుతరావు, టీడీపీ మండల అధ్యక్షుడు బోను చంద్రమౌళి ఉన్నారు.

ఎమ్మెల్యే విజయచంద్రకు కృతజ్ఞతలు

●పార్వతీపురం: సీతానాగరం మండలం కాశయ్యపేటలో ఇటీవల ప్రాథమిక వ్యవసాయ పరపతి సహకార సంఘం ఛైర్మన్‌గా నియమితులైన తేలు కామేశ్వరరావు, డైరెక్టర్లు.. బోనెల విజయచంద్రకు కృతజ్ఞతలు తెలిపారు. పట్టణంలోని పార్టీ కార్యాలయంలో ఎమ్మెల్యేను శనివారం నూతన అధ్యక్షుడు, డైరెక్టర్లు కలిసి పూలమాలతో సత్క రించారు. కార్యక్రమంలో చంద్రశేఖర్, తెంటు అప్పలనాయుడు తదితరులు పాల్గొన్నారు.

'స్వచ్ఛతాహి సేవ'లో భాగస్వాములు కండి

● కలెక్టర్ ప్రభాకర్ రెడ్డి



చీపురుతో శుభ్రం చేస్తున్న కలెక్టర్

బెలగాం, నవంబరు29 (ఆంధ్రజ్యోతి): స్వచ్ఛతాహి సేవలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని కలెక్టర్ ఎస్.ప్రభాకర్ రెడ్డి పిలుపునిచ్చారు. శనివారం స్థానిక ఆర్‌సీఎంలోని ప్రభుత్వ కార్యాలయాల సముదాయం వద్ద నిర్వహించిన ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమంలో కలెక్టర్ పాల్గొన్నారు. శ్రమదానం చేసి జిల్లా ప్రజలకు ఆదర్శంగా నిలిచారు. జిల్లా అధికారులందరినీ భాగస్వాములను చేశారు. కార్యాలయాల ఆవరణను శుభ్రం చేయించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ పరిసరాల పరిశుభ్రతకు ప్రతి ఒక్కరూ సమయాన్ని కేటాయించాలన్నారు. స్వచ్ఛ ఆంధ్ర-స్వర్ణ ఆంధ్ర కార్యక్రమం ప్రతి ఒక్కరి బాధ్యత అన్నారు. కార్యక్రమంలో డీఆర్వో హేమలత, సబ్ కలెక్టర్ వైశాలి తదితరులు పాల్గొన్నారు.

బడ్జెట్ సమావేశం వాయిదా



మాట్లాడుతున్న వైస్ ఎంపీపీ

పాలకొండ, నవంబరు29 (ఆంధ్రజ్యోతి): స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శనివారం నిర్వహించిన బడ్జెట్ సమావేశం వాయిదా పడింది. ఎంపీపీ బొమ్మాళి భాను అధ్యక్షతన నిర్వహించిన బడ్జెట్ తీర్మానంపై సమావేశంలో చర్చ జరగ్గా 12 మంది ఎంపీటీసీ సభ్యులకు గాను 8 మంది సభ్యులు హాజరయ్యారు. వీరిలో ఆరుగురు వైసీపీ సభ్యులు ఉండగా, ఇద్దరు కూటమి సభ్యులు ఉన్నారు. వైసీపీ సభ్యులంతా బడ్జెట్ తీర్మానానికి వ్యతిరేకంగా ఓటు వేశారు. దాంతో ఎంపీడీవో విజయరంగారావు సమావేశాన్ని వాయిదా వేశారు. వైస్ ఎంపీపీ కనపాక సూర్యప్రకాశ్ మాట్లాడుతూ అభివృద్ధి పనులకు సంబంధించి వైసీపీ ప్రజాప్రతినిదులకు సముచిత స్థానం కల్పించలేదన్నారు. అభివృద్ధి పనుల మంజూరులో తమ సభ్యులకు అన్యాయం జరిగిందన్నారు. దీంతో తాము బడ్జెట్ సమావేశంలో వ్యతిరేకంగా ఓటు వేశామన్నారు.

వార్షిక బడ్జెట్ ఆమోదం

కురుపాం, నవంబరు29 (ఆంధ్రజ్యోతి): స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శనివారం ఎంపీపీ శెట్టి పద్మావతి అధ్యక్షతన బడ్జెట్ సమావేశం నిర్వహించారు. 2025-26 సంవత్సరం బడ్జెట్ 68 కోట్లు 49 లక్షల 21వేల రూపాయలు సవరించి 2026-27 సంవత్సరం బడ్జెట్‌ను 69 కోట్ల 84 లక్షల 22వేలుగా అంచనా వేశారు. బడ్జెట్‌ను ఏఓ పి.వి.నాగభూషణరావు సభ్యులకు చదివి వినిపించగా సభ్యులు ఏకగ్రీవంగా ఆమోదించారు. సమావేశంలో డిప్యూటీ ఎంపీడీవో జె.రమేష్ బాబు, జడ్పీటీసీ సభ్యురాలు సుజాత, మండల కో-ఆప్షన్ షేక్ జిలాని, వైస్ ఎంపీపీ బి.అన్నాజీరావు పాల్గొన్నారు.

సస్పెండ్ చేయడం అన్యాయం



నిరసన తెలుపుతున్న ఉద్యోగులు

పాలకొండ, నవంబరు29 (ఆంధ్రజ్యోతి): ఏపీ పీటీడీ ఉద్యోగి ఎం.వైకుంఠంను సస్పెండ్ చేయడం అన్యాయమని నేషనల్ మజ్దూర్ యూనియన్ జిల్లా ఉపాధ్యక్షుడు పి.ఎల్.రావు అన్నారు. శనివారం పాలకొండ డిపో ఎదుట యూనియన్ ఆధ్వర్యంలో రెండో రోజు ఉద్యోగులు గేట్ మీటింగ్ ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బ్రీత్ ఎనలైజర్ మిషన్లపై తమకు అనుమానాలు ఉన్నాయన్నారు. డిపో కార్యదర్శి వావిలపల్లి రాజేష్ మాట్లాడుతూ డిపోలో సమస్యలను యాజమాన్యం పట్టించుకోవడం లేదని ఆరోపించారు. యాజమాన్యం, అధికారులు కక్షపూరితంగా వ్యవహరిస్తున్నారని విమర్శించారు. కార్యక్రమంలో ఎం.ఆర్.మూర్తి, ఎం.ఐ.నాయుడు, డి.ఆర్.రావు, ఎం.ఎ.కుమార్, బుడ్డయ్య, జోసెఫ్ కృష్ణ తదితరున్నారు.

ఉపాధ్యాయులకు క్రీడా పోటీలు

సీతానగరం, నవంబరు29 (ఆంధ్రజ్యోతి): జోగింపేట కేజీబీవీలో ఉపాధ్యాయినిలకు త్రో బాల్ పోటీలను శనివారం నిర్వహించారు. ఎంఈవో జి.సూరిదేముడు పోటీలను ప్రారంభించారు. అలాగే బూర్జ ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో ఎంఈవో-2 ఎం.వెంకటరమణ ఆధ్వర్యంలో ఉపాధ్యాయులకు క్రికెట్ పోటీలు జరిగాయి. ఈ సందర్భంగా ఎంపీడీవో ప్రసాద్ మాట్లాడుతూ నిరంతరం విద్యా బోధనలు నిర్వహిస్తున్న ఉపాధ్యాయులకు క్రీడల పట్ల ఆసక్తి ఉన్న ప్పటికీ వారు అందుకు సమయం కేటాయించే అవకాశం ఉండద న్నారు. అందుకే వారిని ఆటలు, పాటల పోటీల్లో భాగస్వాములను చేసున్నామన్నారు. మండల స్థాయిలో విజేతలుగా నిలిచిన ఉపాధ్యాయులకు జిల్లా స్థాయిలో నిర్వహించే పోటీల్లో పాల్గొంటారన్నారు.

ఆటలతో ఆరోగ్యం

●వీరఘట్టం, నవంబరు29 (ఆంధ్రజ్యోతి): స్థానిక జడ్పీ ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో శనివారం ఉపాధ్యాయులకు క్రికెట్ పోటీలు నిర్వహించారు. పోటీలను డిప్యూటీ డీఈవో పి.కృష్ణమూర్తి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆటలు ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తాయన్నారు. ఆటల పోటీలు స్నేహభావాన్ని పెంపొందిస్తాయని, విద్యార్థులకు ఆటలు ఆడించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఈవోలు గౌరునాయుడు, ఆనందరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రైతుల సంక్షేమమే చంద్రబాబు ధ్యేయం

గరుగుబిల్లి, నవంబరు29 (ఆంధ్రజ్యోతి): రైతుల సంక్షేమమే ముఖ్యమంత్రి చంద్రబాబు ధ్యేయమని అరకు పార్లమెంట్ టీడీపీ అధికార ప్రతినిధి, నాగూరు ఎంపీటీసీ సభ్యులు ద్వారపురెడ్డి సత్య నారాయణ అన్నారు. శనివారం చిలకాం గ్రామంలో నిర్వహించిన రైతన్నా మీకోసం కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఇంటింటికీ వెళ్లి రైతులకు పంచ సూత్రాల కరపత్రాలను పంపిణీ చేశారు. కూటమి ప్రభుత్వ హయంలో రైతులకు జరుగుతున్న లబ్ధిని వివరించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకుడు ఏగిరెడ్డి నారాయణ రావు పాల్గొన్నారు.

రైతులు అప్రమత్తంగా ఉండాలి

సీతానగరం, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): ద్విత్వా తుఫాను హెచ్చరికల నేపథ్యంలో వరి పంట కోతలు, నూర్పులు చేస్తున్న రైతులు అప్రమత్తంగా ఉండాలని మండల వ్యవసాయాధికారి ఎస్. అవినాష్ సూచించారు. శనివారం ఆయన మండలంలో పలు గ్రామాల్లో పర్యటించారు. రైతులు నూర్పిడి చేసిన ధాన్యాన్ని తడవ కుండా టార్పాలిన్లతో కప్పి భద్రపరచుకోవాలని సూచించారు.

కూటమిని విమర్శించే హక్కు లేదు

జియ్యమ్మవలస, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): పది లక్షల కోట్ల రూపాయల అప్పుతో రాష్ట్రాన్ని అప్పగించిన వైసీపీ ప్రభుత్వానికి కూటమిని విమర్శించే హక్కు లేదని కొప్పల వెలమ కార్పొరేషన్ డైరెక్టర్ గొట్టాపు వెంకటనాయుడు అన్నారు. శనివారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఎంపీపీ బొంగు సురేష్‌తో కలిసి ఆయన మాట్లాడారు. కూటమి ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన సూపర్ సిక్స్ హామీలు అధికారంలోకి వచ్చిన ఏడాదిన్నరలో నెరవేర్చడంతో వైసీపీ దాన్ని జీర్ణించుకోలేక పోతోందన్నారు. కార్యక్రమంలో టీడీపీ మండల కన్వీనర్ జోగి భుజంగరావు, పీఏసీఎస్ అధ్యక్షుడు డి.సోములు, వైస్ ఎంపీపీ నరేష్, మాజీ వైస్ ఎంపీపీ చంద్ర మౌళి, శ్రీరామ్మూర్తి, తాతబాబు, తదితరులు పాల్గొన్నారు.

2,500 టన్నుల ధాన్యం సేకరణ టార్గెట్

గుమ్మలక్ష్మీపురం, నవంబరు29 (ఆంధ్రజ్యోతి): మండలంలో ఈ ఏడాది 2,500 టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేయాలని నిర్ణయించామని మండల వ్యవసాయ అధికారి శంకరరావు తెలిపారు. వనివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఇప్పటికే ఎల్విన్‌పేట, రాయగడ జమ్ము, గొయ్యిపాక, ఇరిడి ప్రాంతాల్లో కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు. గిరిజన రైతులు తాము పండించిన ధాన్యాన్ని దళారీలకు అమ్మకుండా ఈ కొనుగోలు కేంద్రానికి తీసుకువచ్చి గిట్టుబాటు ధర పొందాలని కోరారు.

కేజీబీవీలో ఫుడ్ ఫెస్టివల్

వీరఘట్టం, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): రేగులపాడు కేజీబీవీలో శనివారం ఫుడ్ ఫెస్టివల్ నిర్వహించారు. విద్యార్థులు తయారు చేసిన ఆహార పదార్థాలు ప్రదర్శించారు. అనంతరం విద్యార్థులకు పంచిపెట్టారు. మంచి ఆహారంతోనే ఆరోగ్యం సమకూరుతుందని ఉపాధ్యాయులు, విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

భోజనం రుచికరంగా ఉండాలి



వంటలను పరిశీలిస్తున్న ఏపీవో చిన్నబాబు

సీతంపేట రూరల్, నవంబరు29 (ఆంధ్రజ్యోతి): ఐటీడీఏ పరిధిలో నిర్వహిస్తున్న ఆశ్రమ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు అందించే భోజనం రుచికరంగా ఉండాలని ఐటీడీఏ ఏపీవో జి.చిన్నబాబు ఆదేశించారు. దోనుబాయి గిరిజన సంక్షేమ ఆశ్రమ బాలుర ఉన్నత పాఠశాలను శనివారం ఆయన సందర్శించారు. మెనూ పక్కాగా అమలు చేయాలన్నారు. గిరిజన విద్యార్థుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. పదోతరగతి విద్యార్థుల వందరోజుల ప్రణాళిక సక్రమంగా జరిగేలా చూడాలని హెచ్‌ఎంకు సూచించారు. వెనుకబడిన విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహించాలని ఆదేశించారు.

పాలకొండ అభివృద్ధికి సబ్‌ప్లాన్ నిధులు



సమావేశం జరుగుతున్న దృశ్యం

పాలకొండ, నవంబరు29 (ఆంధ్రజ్యోతి): నగర పంచాయతీలో సమగ్ర అభివృద్ధికి సబ్ ప్లాన్ నిధులు కేటాయిస్తున్నట్టు నగర పంచాయతీ ఛైర్‌పర్సన్ ఆకుల మల్లీశ్వరి తెలిపారు. శనివారం స్థానిక నగర పంచాయతీలో నిర్వహించిన పాలకవర్గ సమావేశానికి ఆమె అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. రూ.2.50 కోట్లు ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్ నిధులను నగర పంచాయతీ పరిధిలోని ఎస్సీ, ఎస్టీ జనాభా ఉన్న ప్రాంతాలతో పాటు అన్ని వార్డులకు సమాన ప్రాతిపదికన కేటాయిస్తామన్నారు. దీనిపై 12వ వార్డు కౌన్సిలర్ ప్రతినిధి బాబీ మాట్లాడుతూ సబ్‌ప్లాన్ నిధులను ఎస్సీ, ఎస్టీలకు మాత్రమే కేటాయిం చాలని కోరారు. దీంతో వైసీపీ, కూటమి కౌన్సిలర్లు ముక్తకంఠంతో ఖండిం చారు. అనంతరం అందరూ ఏకగ్రీవంగా ఆమోదించారు. పలు అభివృద్ధి పనులపై తీర్మానం చేశారు. కమిషనర్ రత్నంరాజు, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

రైతులకు ఇబ్బంది కలగనీయవద్దు



మాట్లాడుతున్న తహసీల్దార్ అప్పారావు

జియ్యమ్మవలస, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): ధాన్యాన్ని నిబంధనల ప్రకారం కొనుగోలు చేసేలా అధికారులు చర్యలు తీసుకోవాలని, రైతులకు ఇబ్బంది కలగనీయవద్దని ఎంపీపీ బొంగు సురేష్ అన్నారు. శనివారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఆయన అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహిం చారు. ముందుగా సమావేశంలో వార్షిక బడ్జెట్‌ను ఎంపీడీవో కర్రి ధర్మారావు ప్రవేశపెట్టారు. దాన్ని సభ్యులు ఏకగ్రీవంగా ఆమోదించారు. ధాన్యం కొనుగోలుపై జరిగిన చర్చలో తహసీల్దార్ ఎన్.అప్పారావు, మండల వ్యవసాయ అధికారి ఆర్.విజయభారతి మాట్లాడుతూ ఎక్కడ ఎటువంటి ఇబ్బందులు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని వారు కోరారు. అనంతరం గృహ నిర్మాణాలు, గృహాల మంజూరుపై చర్చ జరిగింది. సమావేశంలో విద్యుత్ శాఖ ఏఈ శంకరరావు, ఏపీఎం శివన్నాయుడు, ఎంఈవో ముదిలి శ్రీనివాసరావుతదితరులు పాల్గొన్నారు.

డ్రైవర్లు అప్రమత్తంగా ఉండాలి

సాలూరు, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): డ్రైవర్లు బస్సులు అప్రమ త్తంగా ఉండాలని ఎంవీఐ జేవీఎస్ఎస్ఎస్ ప్రసాద్ సూచించారు. శనివారం సాలూరులోని పలు బస్సుల్లో తనిఖీలు నిర్వహించారు. బస్సుల్లో ప్రమాదాల్లో ఎలా వ్యవహరించాలి, రక్షణ విషయాలపై కోసం బస్సు డ్రైవర్లకు అవ గాహన కల్పించారు. అలాగే బస్సు రికార్డులను పరిశీలించారు.

సమస్యల పరిష్కారానికి కృషి



వినతులు స్వీకరిస్తున్న ఎమ్మెల్యే జయకృష్ణ

పాలకొండ, నవంబరు29 (ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ఎమ్మెల్యే నిమ్మక జయకృష్ణ అన్నారు. పట్టణంలోని క్యాంప్ కార్యాలయంలో జనవాణి కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన ప్రజల నుంచి వినతిపత్రాలు స్వీకరించారు. సంబంధిత సమస్యలపై అధికారులతో మాట్లాడి పరిష్కరించాలని ఆదేశించారు. కార్యక్రమంలో పలువురు కూటమి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

మున్సిపల్ స్టాండింగ్ కౌన్సిల్‌గా 'వడ్డాది'



సమావేశంలో మాట్లాడుతున్న కౌన్సిలర్లు

సాలూరు, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): సాలూరు మున్సిపల్ స్టాండింగ్ కౌన్సిల్‌గా వడ్డాది షణ్ముఖ ముత్యాలును కౌన్సిలర్లు ఎన్నుకున్నారు. శనివారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలో శనివారం మున్సిపల్ ఛైర్‌పర్సన్ పువ్వల ఈశ్వరమ్మ అధ్యక్షతన మున్సిపల్ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పలు అంశాలపై తీర్మానం చేసిన మున్సిపల్ సభ్యులు అనంతరం మున్సిపల్ కౌన్సిల్ సభ్యుడిగా గతంలో పనిచేసిన తాడ్డి తిరుపతిరావును కొనసాగించాలా లేదా కొత్తగా వడ్డాది షణ్ముఖ ముత్యాలును ఎంపిక చేయాలా అనే విషయంపై ఓటింగ్ నిర్వహించారు. ఈ ఓటింగ్ ప్రక్రియలో 29 కౌన్సిల్ సభ్యులకు గానూ 14 మంది వడ్డాది షణ్ముఖ ముత్యాలుకు వచ్చాయి. దీంతో వడ్డాది షణ్ముఖ ముత్యాలు మున్సిపల్ స్టాండింగ్ కౌన్సిల్ సభ్యుడిగా మున్సిపల్ కమిషనర్ రత్నకుమార్ ప్రకటించారు. మున్సిపల్ సర్వసభ్య సమావేశంలో పలువురు అధికారులు, కౌన్సిల్ సభ్యులు పాల్గొన్నారు.

ఉద్యోగుల ఐక్యతతో సమస్యల పరిష్కారం



ప్రమాణ స్వీకారం చేస్తున్న కార్యవర్గం

కురుపాం, నవంబరు29 (ఆంధ్రజ్యోతి): ఉద్యోగులు ఐక్యంగా ఉన్నప్పుడే సమస్యల పరిష్కారం సులభమవుతుందని ఏపీ ఎన్జీజీవో జిల్లా అధ్యక్షుడు జీవీఆర్ఎస్ కిశోర్ అన్నారు. శనివారం కురుపాంలో ఏపీ ఎన్జీవో కురుపాం యూనిట్ ఎన్నిక నిర్వహించారు. యూనిట్ అధ్యక్షుడిగా ఎస్.ఎస్.ప్రకాశరావు(మెడికల్) ఎన్నికయ్యారు. సెక్రటరీగా ఎ.వెంకటనాయుడు (పంచాయితీ సెక్రటరీ), కోశాధికారిగా ఎ.సాంబశివరావు (ఇరిగేషన్), అసోసియేట్ ప్రెసిడెంట్‌గా బి.సంతోష్ గుణకరరావు (మెడికల్), ఆర్గనైజింగ్ సెక్రటరీగా ఆర్. కల్యాణి (సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం)లతో పాటు 14 మందిని సభ్యులుగా ఎన్నుకున్నారు. ఎన్నికల అధికారులు జొన్నాడ విక్టర్, ఎస్.దుర్గాప్రసాద్ వ్యవహరించారు. యూనిట్ కార్యవర్గంతో జిల్లా అధ్యక్షుడు కిశోర్ ప్రమాణ స్వీకారం చేయించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం వెంటనే పీఆర్‌సీ కమిషన్ వేయాలన్నారు. ఐఆర్ మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఉద్యోగులు పెద్దఎత్తున పాల్గొన్నారు.

జాబ్ మేళాను వినియోగించుకోండి

పార్వతీపురం రూరల్, నవంబరు29 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో డిసెంబరు 3న గాయత్రి డిగ్రీ కళాశాలలో నిర్వహించనున్న జాబ్‌మేళాను నిరుద్యోగ యువత వినియోగించుకోవాలని ఎమ్మెల్యే బోనెల విజయచంద్ర సూచించారు. శనివారం స్థానిక టీడీపీ కార్యాలయంలో జాబ్‌మేళాకు సంబంధింఇన వాల్ పోస్టర్‌ను ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఈ జాబ్‌మేళాలో 23 కంపెనీల ప్రతినిధులు పాల్గొంటారన్నారు. పదోతరగతి నుంచి పీజీ వరకు చదివిన యువతీ యువకులు మేళాకు హాజరు కావచ్చన్నారు.

ఇళ్ల పట్టాల పంపిణీ

●పార్వతీపురం, నవంబరు29 (ఆంధ్రజ్యోతి): వెంకంపేట నిరుపేదలకు శనివారం ఎమ్మెల్యే బోనెల విజయచంద్ర ఇళ్ల పట్టాలను పంపిణీ చేశారు. పార్టీ కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. లబ్ధిదారులంతా సత్వరమే ఇళ్ల నిర్మాణం చేపట్టాలని కోరారు. ప్రభుత్వం అందజేస్తున్న పథకాలను వినియోగించుకోవాలన్నారు. ఇళ్ల పట్టాలు పొందిన లబ్ధిదారులు ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు.

ఆశ్రమ పాఠశాలలో వార్షిక తనిఖీ



మాట్లాడుతున్న డిప్యూటీ ఈవో రామ్మోహనరావు

సీతంపేట రూరల్, నవంబరు29 (ఆంధ్రజ్యోతి): సామరెల్లి గిరిజన సంక్షేమ ఆశ్రమ బాలికల ఉన్నత పాఠశాలను డిప్యూటీ ఈవో జి.రామ్మోహనరావు, ప్యానల్ సిబ్బంది శనివారం వార్షిక తనిఖీలు నిర్వహించారు. విద్యా విషయ, పరిపాలన అంశాలు, పాఠశాలకు వచ్చే నిధుల నిర్వహణ రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా పలు అంశాలపై పాఠశాల హెచ్‌ఎం ఆరిక భాస్కరరావు, ఉపాధ్యాయులకు సూచనలు చేశారు. గిరిజన విద్యార్థుల విద్యా ప్రమాణాలు స్థాయి పెంచేందుకు ఉపాధ్యాయులు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని డిప్యూటీ ఈవో సూచించారు. వార్షిక తనిఖీలో ప్యానల్ సిబ్బంది జి.దివాకర్, పి.ధర్మారావు, కె.కృష్ణమూర్తి, ఎస్.ప్రేమకుమారి, జె.రోజాలక్ష్మి, పి.క్రాంతి కుమార్, పద్మ, సుబ్బారావు, ఎల్.ఉమామహేశ్వరరావు పాల్గొన్నారు.

పరిసరాలను శుభ్రంగా ఉంచుకోండి

సాలూరు, నవంబరు29 (ఆంధ్రజ్యోతి): పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని మున్సిపల్ కమిషనర్ టి.రత్నకుమార్ అన్నారు. శనివారం పట్టణంలో 23వ వార్డు శ్రీరామ కాలనీ వార్డును స్వచ్ఛ వార్డుగా గుర్తించి ఆ వార్డులోని మహిళలతో మనవీధి-మనబాధ్యత కార్యక్రమాన్ని నిర్వహించారు. వ్యర్థాలను ఆరుబయట కాలువలో పారబోయకుండా తమ ఇంటికి వచ్చిన పారిశుధ్య కార్మికులకు తడి, పొడి చెత్తలను వేర్వేరుగా అందజేయాలని అవగాహన కల్పించామన్నారు. కాలువల్లో పూడికతీత పనులు చేపట్టారు. షాపులు, హోటళ్లవద్ద డస్ట్‌బిన్స్ ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ ఎన్.బాలకృష్ణ, వార్డు ప్రజలు పాల్గొన్నారు.

బాధితులకు అండగా ఉంటాం



మాట్లాడుతున్న జనసేన నాయకులు

సాలూరు, నవంబరు29 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర మంత్రి గుమ్మిడి సంధ్యారాణి పీఏస్ సతీష్‌పై ఆరోపణల ఘటనలో బాధితులు ఎవరైనా, వారికి అండగా ఉంటామని జనసేన పార్టీ నాయకులు అన్నారు. శనివారం పట్టణంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలోజనసేన నాయకులు శివకృష్ణ, నవీన్, సుశాంత్, హేమంత్, రవి, చంటి, నానీ, ప్రతాప్, మోహన్ మాట్లాడారు. ఆరోపణలు నిజమైతే వారికి న్యాయం జరిగేలా పోరాటం చేస్తామన్నారు. కూటమిలో ఉన్నంత మాత్రాన తప్పు చేసిన వారిని వారిని వెనకేసుకు రామని తెలిపారు. కూటమిపై ఇష్టారీతిలో మాట్లాడితే చూస్తూ ఊరుకోమన్నారు.

ఆర్‌సీఎంలో ముగ్గుల పోటీలు ప్రారంభం

పార్వతీపురం, నవంబరు29 (ఆంధ్రజ్యోతి): ప్రపంచ ఎయిడ్స్ దినోత్సవాన్ని పురస్కరించుకుని పట్టణంలోని ఆర్‌సీఎంలోని ప్రభుత్వ కార్యాలయాల సముదాయంలో శనివారం ముగ్గుల పోటీ నిర్వహించారు. ఈ పోటీలను కలెక్టర్ ఎస్.ప్రభాకర్‌రెడ్డి ప్రారంభించారు. హెచ్‌ఐవీ, ఎయిడ్స్ నివారణ, అవగాహన అంశాలను తెలియజేస్తూ వేసిన వివిధ రకాల ముగ్గులను కలెక్టర్ ఆసక్తిగా తిలకించారు. ఇటువంటి సృజనాత్మకత పోటీలు యువతలో ప్రజల్లో ఎయిడ్స్ నియంత్రణపై అవగాహనను బలోపేతం చేస్తాయన్నారు. కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి కె.హేమలత, సబ్ కలెక్టర్ వైశాలి పాల్గొన్నారు.

పారదర్శకంగా టెండర్ ప్రక్రియ

పార్వతీపురం, నవంబరు29 (ఆంధ్రజ్యోతి): ఐటీడీఏ పరిధిలోని గిరిజన సంక్షేమ విద్యా సంస్థలకు సంబంధించిన జీసీసీ కమోడిటీ టెండర్ల ప్రక్రియ పారదర్శకంగా జరిగిందని జేసీ, ఐటీడీఏ పార్వతీపురం ప్రాజెక్టు అధికారి సి.యశ్వంత్‌కుమార్ రెడ్డి తెలిపారు. శనివారం గిరిమిత్ర హాల్‌లో జరిగిన టెండర్ ప్రక్రియను పీవో స్వయంగా పర్యవేక్షించారు. గిరిజన సంక్షేమ విద్యా సంస్థలు, హాస్టళ్లకు నాణ్యమైన సరుకులను సరఫరా చేయడానికి టెండర్ ప్రక్రియ నిర్వహిస్తున్నామన్నారు. ఏపీవో పి.మురళీధర్ పాల్గొన్నారు.

ఆక్రమణలతో వాహనదారులకు ఇక్కట్లు



మక్కువలో ప్రధాన రహదారి ఇలా

మక్కువ రూరల్, నవంబరు29 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో రహదారులు ఆక్రమణకు గురయ్యాయి. దాంతో వాహనాల రాకపోకలకు ఇబ్బందులు తలెత్తుతున్నాయి. బస్టాండ్ నుంచి మక్కువ వరకూ ప్రధాన రహదారిని చిరు వ్యాపారులు ఆక్రమించేశారు. గతంలో షాపులు రోడ్డుకు దూరంగా ఉండేవి. ఇటీవల ఒకరిని మించి మరొకరు పోటీపడి షాపులను ముందుకు జరిపేశారు. దీంతో నిత్యం ప్రజల రాకపోకలతో రద్దీగా వుండే బస్టాండ్‌తో పాటు మార్కెట్ ప్రాంతం ఇరుగ్గా మారిపోయింది. వాహనాలు రాకపోకలు సాగించలేని దుస్థితి నెలకొంది. తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. ట్రాఫిక్ సమస్యలు నిత్యకృత్యమయ్యాయి. ఇక్కడే ఇటీవల ఓ రిటైర్డ్ ఉపాధ్యాయుడిని బస్సు ఢీకొనడంతో మృత్యువాత పడ్డారు. స్థానిక మూడు రోడ్ల జంక్షన్ నుంచి దుగ్గేరు రోడ్డులోని సువర్ణముఖి వంతెన వరకు రోడ్డును ఇరువైపులా వ్యాపారులు ఆక్రమించేశారు. ఇకపైనా అధికారులు స్పందించిన రహదారుల వెంబడి ఆక్రమణలను తొలగించాల్సిన అవసరం ఉంది.